శుక్రవారం
25-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 65
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సౌదీ సహా ఆరు దేశాలకు బ్రిక్స్ ఆహ్వానం

బ్రిక్స్ కూటమి విస్తరణకు చారిత్రక నిర్ణయం జరిగింది. సౌదీ అరేబియా సహా ఆరు దేశాలకు సభ్యత్వం లభించింది. మూడు రోజుల పాటు సభ్యదేశాల అధినేతలు జనాంతిక సమావేశాలు జరిపిన అనంతరం ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

2 లో

జాతీయ ఉత్తమనటుడు అల్లుఅర్జున్

- 69 ఏళ్లలో అవార్డు అందుకున్న తొలి తెలుగు హీరోగా రికార్డు
- ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప చిత్రాలకు అవార్డుల పంట
- ఉత్తమ నటిగా కృతిసనన్, అలియాభట్
- జాతీయ ఉత్తమ చిత్రంగా రాకెట్రీ : ది నంబీ ఎఫెక్ట్
- ఉత్తమ తెలుగు చిత్రంగా 'ఉప్పెన'

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ను కేంద్రం ప్రకటించింది. జాతీయ ఉత్తమ నటుడిగా తెలుగు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంపికయ్యారు. ఆయన నటించిన పుష్ప ద రైజ్ సినిమాకుగాను ఈ అవార్డును గెలుచుకున్నారు. ఇక ఉత్తమ నటి అవార్డును ఈసారి ఇద్దరు హీరోయిన్‌లకు ఉమ్మడిగా ప్రకటించారు. వీరిద్దరూ ఆలియాభట్ (గంగూబాయ కటియావాది), కృతి సనన్ (మిమి). న్యూఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో విలేకరుల

- మిగతా 2 లో

పెత్తందారీ ప్రభుత్వాలను గద్దె దించాల్సిందే

ఏపీలో దొంగ బిల్లులతో ఇసుక దోపిడీ

విజయవాడ సభలో రామకృష్ణ

8లో

సామాన్యుల బాగోగులు పట్టకుండా పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. 'దేశాన్ని కాపాడుకుందాం-రాష్ట్రాన్ని రక్షించుకుందాం' నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టేందుకు సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర గురువారం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించింది.

హే...కృష్ణా !

- కరుణించని వరుణుడు
- అడుగంటుతున్న రిజర్వాయర్లు
- ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం
- ఇదే పరిస్థితి కొనసాగితే తాగునీటికీ కటకటే

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలోని కృష్ణానదీ ఆయకట్టు పరిస్థితి ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకు చెదురుమదురు వర్షాలు తప్ప భారీ వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం నుంచి దిగువ పులిచింతల వరకు అన్ని రిజర్వాయర్లు ఒట్టిపోతున్నాయి. సహజంగా ఆగస్టు నెలాఖరుకు అన్ని రిజర్వాయర్లు నిండుకుండల్లా తొణికిసలాడాల్సి ఉండగా, అన్ని డ్యామ్‌ల్లో నీటిమట్టం 50శాతానికి దిగువకు పడిపోయింది. దీంతో సాగర్, శ్రీశైలం, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ ఆయకట్టు సాగు పరిస్థితి ప్రశ్నార్థకమైంది. మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో డ్యామ్‌ల్లో ఉన్న నీరు కూడా ఎండ తీవ్రతకు ఇంకిపోతోంది. ఇదే సమయానికి గత ఏడాది కృష్ణా రిజర్వాయర్లన్నీ 97శాతం నీటి నిల్వతో ఉండగా, ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయరులో 215 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 81 టీఎంసీల నీరు ఉంది. అలాగే అత్యధికంగా 312 టీఎంసీల సామర్థ్యం కల్గిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 152.39 టీఎంసీలు, 45.77 టీఎంసీల సామర్థ్యం కల్గిన పులిచింతల ప్రాజెక్టు 24.41 టీఎంసీల నీటి నిల్వతో ఉన్నాయి. ఎగువన కర్నాటక రాష్ట్రంలో మాత్రం ఆల్మట్టి, నారాయణపుర డ్యామ్‌లు మాత్రం నిండుకుండల్లా ఉన్నాయి. 519.60 టీఎంసీల సామర్థ్యం గల ఆల్మట్టి డ్యామ్‌లో ప్రస్తుతం 519. 60 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే ప్రస్తుతం కర్నాటకలోనూ వర్షాలు పడకపోవడంతో ఎగువ నుంచి ప్రాజెక్టుకు వచ్చే నీటిని వారు ఆయకట్టుకు మళ్లిస్తూ దిగువకు మాత్రం నామమాత్రంగా 2,137 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. అలాగే దీనికి దిగువన ఉన్న నారాయణపుర డ్యామ్492.25 టీఎంసీలకు గాను 490.11 టీఎంసీల నీటి నిల్వ కలిగి ఉంది. ఎగువ నుంచి వస్తున్న 7,665 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల దిగువన వర్షాలు తరచూ పడుతున్నప్పటికీ ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి నిల్వ సామర్థ్యం కేవలం 3 టీఎంసీలే

- మిగతా 2 లో

భారత రెజ్లింగ్ సమాఖ్య

సభ్యత్వం రద్దు!

ప్రపంచ రెజ్లింగ్ పాలకమండలి నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రపంచ వేదికపై భారత్‌కు గట్టి షాక్ తగిలింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) సభ్యత్వాన్ని యునైటెడ్ ప్రపంచ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పాలకమండలి రద్దు చేసింది. ఎన్నికలు నిర్వహించడంలో డబ్ల్యూఎఫ్‌ఐ విఫలమైనందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూడబ్ల్యూడబ్ల్యూ వెల్లడించింది. డబ్ల్యూఎఫ్‌ఐ సభ్యత్వాన్ని నిరవధికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు డబ్ల్యూఎఫ్‌ఐ తాత్కాలిక కార్యనిర్వాహక కమిటీకి యూడబ్ల్యూడబ్ల్యూ బుధవారం రాత్రి సమాచారం ఇచ్చినట్లు భారత ఒలిపింక్ అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. కాగా ఈ నిర్ణయంతో ఇండియన్ రెజ్లర్లు... రాబోయే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో దేశం తరపున పాల్గొనే వీలుండదు. సెప్టెంబరు 16 నుంచి

- మిగతా 2 లో

మళ్లీ అల్పపీడనం

బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో వచ్చే ఐదు రోజులు వానలు పడనున్నాయి. ఈ మేరకు భారత వాతావరణ శాఖ గురువారం ప్రకటించింది.

3లో

ఇదీ లోకం!

ప్రజ్ఞా మూన్ వాక్

ల్యాండర్, రోవర్.. చంద్ర రోజుకంటే ఎక్కువే పనిచేయొచ్చు: ఇస్రో

బెంగళూరు: చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ (విక్రమ్) స్టాఫ్ట్ ల్యాండింగ్‌తో చంద్రయాన్–3 మిషన్‌లో కీలక అంకం పూర్తి అయింది. ల్యాండర్ నుంచి ప్రజ్ఞా రోవర్ బయటకు వచ్చి చంద్రుడిపై గురువారం కలియ తిరిగింది. ఈ విషయాన్ని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రకటించింది. 'ఇండియా మూన్ వాక్ చేసింది' అని పేర్కొంది. అయితే చంద్రయాన్–3 ల్యాండర్, రోవర్ జీవితకాలం ఒక చంద్రరోజు (14 రోజులు)కంటే ఎక్కువే ఉండవచ్చని ఇస్రో ఆకాంక్షించింది. చంద్రుడిపై సూర్య కిరణాలు పడిన తర్వాత అవి మళ్లీ ప్రాణం పోసుకునే అవకాశం లేకపోలేదని తెలిపింది. అదే జరిగితే మరిన్ని పరిశోధనలకు వీలు కలుగుతుందని పేర్కొంది. ఒకదాని తర్వాత ఒకటిగా 14 రోజుల పాటు పరిశోధనలు నిర్వహించేలా ల్యాండర్, రోవర్‌లోని వ్యవస్థలు రూపొందినట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం తెలిపింది. చంద్రుడుపై చిమ్మచీకటి కమ్మేసి అతిశీతల వాతావరణం నెలకొనే లోపు అవి తమ పనిని పూర్తి చేస్తాయని ఆశిస్తున్నామని తెలిపింది. ల్యాండర్, రోవర్ కలిపి 1,752 కేజీల బరువు ఉన్నాయి. అవి 14 రోజులు అంటే చంద్రుడిపై

- మిగతా 2 లో

ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొడదాం

- హక్కులు, ప్రయోజనాలు పరిరక్షించుకుందాం
- ఢిల్లీ సభలో కార్మిక, కర్షక నేతల పిలుపు

2లో

విజయవాడలో భారీ అగ్నిప్రమాదం

2లో

300 పైగా బైకులు దగ్ధం

రూ.10 కోట్లకు పైగా నష్టం

సౌదీ సహా ఆరు దేశాలకు బ్రిక్స్ ఆహ్వానం

జనవరి నుంచి సభ్యత్వం

కూటమి విస్తరణ చారిత్రకం: సభ్యదేశాల అధినేతలు

జొహానెస్‌బర్గ్: బ్రిక్స్ కూటమి విస్తరణకు చారిత్రక నిర్ణయం జరిగింది. సౌదీ అరేబియా సహా ఆరు దేశాలకు సభ్యత్వం లభించింది. మూడు రోజుల పాటు సభ్యదేశాల అధినేతలు జనాంతిక సమావేశాలు జరిపిన అనంతరం ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ మేరకు దక్షిణాఫ్రికా గురువారం ప్రకటించింది. బ్రిక్స్ కూటమిని విస్తరించడం ద్వారా గ్లోబల్ సౌత్ సమస్యల పరిష్కారంలో కీలకంగా ఉండాలని బ్రిక్స్ నేతలు భావించారు. అర్జెంటైనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు సభ్యత్వం కల్పిస్తున్నట్లు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా వెల్లడించారు. 2024, జనవరి ఒకటో నుంచి ఈ దేశాలు బ్రిక్స్ సభ్యత్వాన్ని పొందుతాయని తెలిపారు. బ్రిక్స్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలనే ఇతర దేశాల కోరికకు విలువిస్తున్నాం కాబట్టే అందుకోసం భాగస్వామ్య నమూనాల తయారీకిగాను విదేశాంగ మంత్రులకు సూచనలు చేశామన్నారు. భాగస్వామ్యానికి అర్హతగల దేశాలను ఎంపిక చేయాలని పేర్కొనట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి బ్రిక్స్‌లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు మాత్రమే ఉన్నాయి. తాజా నిర్ణయాన్ని చరిత్రాత్మకమైనదిగా బ్రిక్స్ సభ్యదేశాల అధినేతలు వెల్లడించారు. తద్వారా మంచి అభివృద్ధిని ఆకాంక్షించారు. తమ దేశానికి సభ్యత్వం లభించడంపై యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయేద్ హర్షం వ్యక్తం చేశారు. బ్రిక్స్ నిర్ణయాన్ని స్వాగతించారు. కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ట్వీట్ చేశారు. కాగా, 40కుపైగా దేశాలు బ్రిక్స్ సభ్యత్వాన్ని కోరుకుంటుండగా 22 దేశాలు అధికారిక దరఖాస్తులు పంపినట్లు దక్షిణాఫ్రికా వెల్లడించింది.

అభివృద్ధి చెందుతున్న దేశాల కొత్త అధ్యయనం ప్రారంభం

బ్రిక్స్ విస్తరణను చారిత్రకమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. కలిసికట్టుగా పని చేసేలా అభివృద్ధి చెందుతున్న దేశాలకు మంచి అవకాశం లభిస్తోందని, తద్వారా కొత్త అధ్యయనానికి నాంది పలికినట్లు వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలు పని చేయాలనేందుకు బ్రిక్స్ విస్తరణ, ఆధునికీకరణ సంకేతమని భారత ప్రధాని మోదీ తెలిపారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వా స్పందిస్తూ సభ్యత్వం పెంపునకు సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. వారికి ద్వారాలు తెరుస్తున్నామన్నారు. 'మనం ఎదుర్కొనే సవాళ్లకు సృజనాత్మక పరిష్కారాల మూలాలను బ్రిక్స్ అందిస్తున్నద'ని అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వీడియో సందేశం ద్వారా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. బ్రిక్స్ విస్తరణ మార్గదర్శకాల స్వీకరణ ద్వారా ప్రపంచంలో కూటమి పాత్ర, ప్రాధాన్యత మరింత పెరుగుతుందని ఆకాంక్షించారు. ఇదిలావుంటే, పాశ్చాత్య బహుపాక్షిక ఫోరాలకు దీటుగా బ్రిక్స్ విస్తరణ జరగాలని చైనా ప్రతిపాదించింది. అభివృద్ధి చెందిన దేశాల గళాన్ని మరింత బిగ్గరగా వినిపించే మార్గంగా విస్తరణను భావిస్తున్నారు. గతంలో విస్తరణ విషయంలో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. రాజీ కోసం భారత్ యత్నించినట్లు ఆ దేశ అధికారిక వర్గాలు తెలిపాయి. కొత్త సభ్యుల ఎంపికలోనూ భారత్ కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొన్నాయి.

ప్రమాదమా? కుట్ర?

- ప్రిగోజిన్ మరణంపై అనుమానాలు
- విమాన దుర్ఘటనలో వాగ్నర్ చీఫ్ సహా తొమ్మిది మంది మృతి

మాస్కో: రష్యాలో తిరుగుబాటు దళం వాగ్నర్ గ్రూపు చీఫ్ యెవ్‌గనీ ప్రిగోజిన్ (62) విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు ప్రైవేటు జెట్ త్వేర్ ప్రాంతంలో కూలిపోయింది. ముగ్గురు సిబ్బంది సహా మొత్తం 10 మంది చనిపోయారు. రెండు నెలల కిందట రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై తిరుగుబాటు చేసిన ప్రిగోజిన్ మరణాన్ని అధికారులు ధ్రువీకరించారు. అయితే ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రమాదమేనా లేక కుట్ర అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కుర్స్కు పోరుకు 80 ఏళ్లు అయిన సందర్భంగా జాతినుద్దేశించిన పుతిన్ కనీసం ఈ ఘటనను ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మాత్రం దీని వెనుక పుతిన్ ఉండవచ్చన్న సంకేతాలిచ్చారు. ఈ ఘటనపై స్పందిస్తూ 'ఏమి జరిగిందో కచ్చితంగా తెలియదు కానీ ఈ ఘటన నన్ను ఆశ్చర్యపరిచింది. రష్యాలో జరిగే ప్రతిదీ పుతిన్ కనుసన్నల్లో జరుగుతుందని చెప్పనుగానీ.. అన్న వ్యాఖ్యల ద్వారా ఈ ప్రమాదం వెనుక పుతిన్ హస్తం ఉన్నారన్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సన్నిహితుడు మైఖైలో పోడోల్యాక్ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ '2024 ఎన్నికలకు ముందు రష్యాలోని ప్రముఖులకు పుతిన్ నుంచి ఒక సంకేతం. 'జాగ్రత్త! నమ్మకద్రోహం మరణంతో సమానం' అని వ్యాఖ్యానించారు. బెలారస్ ప్రతిపక్ష బహిష్కృత నాయకురాలు స్వెత్లానా టిఖానోవ్స్కాయా 'ఎక్స్' మాధ్యమంగా స్పందిస్తూ 'రష్యాలో తిరుగుబాటు తర్వాత కొంతమంది వాగ్నర్ యోధులు తరలివెళ్లారు.. ప్రిగోజిన్ బెలారస్ చేరుకున్నారు. ఆయన ఓ హంతకుడిగానే గుర్తుండిపోతారు' అని ట్వీట్ చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యలో వాగ్నర్ గ్రూప్ అధినేత ప్రిగోజిన్ పోరాడారు. పుతిన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. 1981లో దొంగతనం, దోపిడీ కేసుల్లో 12 ఏళ్ల జైలుశిక్ష అనుభవించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో రెస్టారెంట్లను నడిపారు. ఈ క్రమంలో పుతిన్ పరిచయం కాగా ప్రిగోజిన్ జీవితం మారిపోయింది. పుతిన్ ఆంతరంగికుల్లో ఒకడిగా ఎదిగారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ డిప్యూటీ మేయర్‌గానూ పని చేసి.. రష్యా ప్రభుత్వ ఆహార కాంట్రాక్టులన్నీ దక్కించుకున్నారు. వాగ్నర్ సైన్యం 90 శాతం మంది ఖైదీలే అని అమెరికా ఓ నివేదికలో పేర్కొంది. ప్రిగోజిన్‌ను మోస్ట్‌వాంటెడ్‌గానూ పేర్కొంది.

నేపాల్ బస్సు ప్రమాదంలో ఆరుగురు భారతీయుల మృతి

ఖాట్మండు: నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మధేశీ ప్రావిన్స్ వద్ద కొండ మార్గంలో వెళుతున్న బస్సు 50మీటర్ల లోతైన లోయలోకి దొర్లిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు భారతీయులు, ఓ నేపాలీతో కలిపి ఏడుగురు మరణించారు. మరో 19 మందికి గాయాలయ్యాయి. గురువారం తెల్లవారుజామున బారా జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మృతులు రాజస్తాన్‌కు చెందిన యాత్రికులని ది ఖాట్మండు పోస్ట్ తెలిపింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 26 మంది ఉన్నట్లు డీఎస్పీ ప్రదీప్ బహదూర్ ఛెత్రీ తెలిపారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించినట్లు చెప్పారు. బస్సు డ్రైవర్ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ హోంబింద్రా బొగోటి తెలిపారు. డ్రైవర్‌కు, సహ కార్మికులకూ గాయాలయ్యాయని, చికిత్స అందించిన అనంతరం వారిని అరెస్టు చేశామని అన్నారు. క్షతగాత్రులు మక్వాన్‌పూర్ జిల్లాలోని హెటౌడాలోగల వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. నేపాల్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. బుధవారం భాగమతి ప్రావిన్స్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు.

ఉ.కొరియా నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలం

సియోల్: ఉత్తరకొరియా నిఘా ఉపగ్రహం ప్రయోగం గురువారం విఫలమైంది. రాకెట్ మూడో దశలో విఫలమైనట్లు కేసీఎన్ఏ వార్తాసంస్థ తెలిపింది. యద్ధ సమయంలో శత్రు దేశాలపై నిఘా పెట్టేందుకు, తమ పైలట్లకు సహాయంగా ఉండేందుకు ఈ ప్రాజెక్టును ఉత్తర కొరియా చేపట్టింది. మూడు నెలల కిందట తొలి ప్రయోగం విఫలం కాగా తాజాగా రెండోసారి కూడా విఫమైనట్లు ఉత్తర కొరియా అంతరిక్ష కేంద్రం వెల్లడించింది. అక్టోబరులో మూడో ప్రయత్నం జరగబోతున్నట్లు తెలిపింది. తాజా ప్రయోగంలో రాకెట్ మూడో దశ ఎమర్జెన్సీ బ్లాస్టింగ్ వ్యవస్థలో లోపం తలెత్తిన కారణంగా మిషన్ విఫలమైందని కేసీఎన్ఏ పేర్కొంది. ఎల్లో సీ మీదుగా ప్రయోగం జరగడంతో జపాన్ రక్షణ వ్యవస్థలు అప్రమత్తమై తమ ప్రజలకు కొన్ని గంటల అత్యవసర హెచ్చరికలు జారీ చేశాయి.

జపాన్, అమెరికా ఖండన

ఉత్తర కొరియా ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీర్మానాలను ఉల్లంఘిస్తోందని జపాన్ అసహనం వ్యక్తం చేసింది. తాజా ప్రయోగాన్ని ఆ దేశ ప్రధాని కిషిదా వ్యతిరేకించారు.

తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అటు అమెరికా కూడా స్పందించింది. ఉత్తర కొరియా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఇలాంటివి మానుకోవాలని, ఏమైన సమస్యలు ఉంటే దౌత్య మార్గాల్లో చర్చించి పరిష్కరించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించింది. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలు ఈమధ్యనే వాషింగ్టన్‌లో సమావేశాన్ని నిర్వహించిన క్రమంలో ఉత్తర కొరియా తాజా ప్రయోగాన్ని చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

భారత రెజ్లింగ్ సమాఖ్య సభ్యత్వం రద్దు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. ప్రపంచ చాంపియన్ షిప్ లో భారత్ నుంచి పోటీ పడే అవకాశం లేకపోవడంతో మన రెజ్లర్లు 'తటస్థ అథ్లెట్లు'గా పోటీపడాల్సి ఉంటుంది. భారత్ ట్యాగ్‌లైన్ లేకుండానే వారు ఆడాల్సి వస్తుంది. ఇటీవలే డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలతో డబ్ల్యూఎఫ్ఐ వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శరణ్ సింగ్‌ను పదవి నుంచి తప్పించాలని మహిళా రెజ్లర్లు డిమాండ్ చేశారు. డబ్ల్యూఎఫ్ఐ ప్యానెల్‌ను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ రద్దు చేసింది. ఆ తర్వాత డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాల నిర్వహణను తాత్కాలిక కమిటీకి అప్పగించింది. ఆగస్టు 27న ఈ కమిటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి 45 రోజుల్లోగా డబ్ల్యూఎఫ్ఐ ప్యానెల్‌కు ఎన్నికలు నిర్వహించాలి. గడువులోగా ఎన్నికలు పూర్తి చేయాలని, లేదంటే సస్పెన్షన్ వేటు తప్పదని ఏప్రిల్ 28న యూడబ్ల్యూడబ్ల్యూ హెచ్చరించింది. అప్పటి నుంచి ఎన్నికలు ఎన్నిసార్లు నిర్వహించాలని చూసినా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ క్రమంలోనే డబ్ల్యూఎఫ్ఐ సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తూ యూడబ్ల్యూడబ్ల్యూ నిర్ణయం తీసుకుంది.

జాతీయ ఉత్తమనటుడు అల్లుఅర్జున్

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో జ్యూరీ... 2021 ఏడాదికి జాతీయ చలన చిత్ర పురస్కారాలను ప్రకటించింది. ఉత్తమ తెలుగు చిత్రంగా ఉప్పెన నిలిచింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించింది. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ (పుష్ప) నిలిచారు. తెలుగులో మొట్టమొదటి జాతీయ ఉత్తమ నటుడు స్టైలిష్ స్టార్ కావడం గమనార్హం. ఆర్ఆర్ఆర్, పుష్ప సినిమాలు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కించుకొని దుమ్మురేపాయి. ఆర్ఆర్ఆర్ సినిమాకు ఏకంగా 6 అవార్డులు రాగా, పుష్ప సినిమాకు రెండు వచ్చాయి. 2021 ఏడాదికిగాను 28 భాషల్లో 280 సినిమాలు వివిధ విభాగాల్లో పోటీపడ్డాయి. జాతీయ ఉత్తమ పురస్కారం అందుకుని మొట్టమొదటి తెలుగు నటుడిగా అల్లు అర్జున్ అరుదైన రికార్డు నమోదు చేశాడు. 69 ఏళ్ల చరిత్రలో మొదటిసారి తెలుగు హీరోకు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు రావడంతో టాలీవుడ్ సెలబ్రిటీలు, సినీ అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. ఆస్కార్ బరిలో విజేతగా నిలిచిన ఆర్ఆర్ఆర్‌కు ఆరు జాతీయ అవార్డులు రావడం మరో విశేషంగా చెప్పవచ్చు.

విజేతలు వీరే:

- ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప),
- ఉత్తమ నటీమణులు - కృతి సనన్ (మిమి), అలియా భట్ (గంగుభాయ్ కతియావాడి)
- ఉత్తమ చిత్రం - రాకెట్రీ : ది నంబీ ఎఫెక్ట్
- ఉత్తమ తెలుగు చిత్రం - ఉప్పెన,
- ఉత్తమ సంగీత దర్శకుడు - దేవిశ్రీ ప్రసాద్ (పుష్ప),
- ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ - కింగ్ సోలోమన్ (ఆర్ఆర్ఆర్),
- ఉత్తమ కొరియోగ్రఫీ - ప్రేమ్ రక్షిత్ (ఆర్ఆర్ఆర్),
- ఉత్తమ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ - కీరవాణి (ఆర్ఆర్ఆర్)
- ఉత్తమ గీత రచయిత - చంద్రబోస్ (కొండపొలం),
- ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్ - శ్రీనివాస్ మోహన్ (ఆర్ఆర్ఆర్),
- ఉత్తమ ప్రజాదరణ చిత్రం - ఆర్ఆర్ఆర్,
- ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్ (మేల్) - కాలభైరవ (ఆర్ఆర్ఆర్, కొమురం భీముడో),
- జాతీయ సమగ్రతా చిత్రం - ది కశ్మీర్ ఫైల్స్
- ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్ (ఫిమేల్) - శ్రేయా ఘోషల్
- ఉత్తమ దర్శకుడు - గోదావరి
- ఉత్తమ సహాయ నటుడు - పంకజ్ త్రిపాఠి (మిమి)
- ఉత్తమ సహాయ నటి - పల్లవి జోషి
- ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్ - భావిన్ రాబారీ(చెల్లో షో)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ - సర్దార్ ఉధమ్
- ఉత్తమ డైలాగ్ రచయిత - గంగుభాయ్ కతియావాడి

ప్రజ్ఞా మూన్ వాక్

(మొదటిపేజీ తరువాయి)

ఒక రోజు పనిచేసేందుకు రూపొందాయి. కానీ ఇంకొక రోజు కూడా పనిచేయవచ్చని, అందుకు సూర్య కిరణాలు వాటికి అవసరమని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.

సూర్య కిరణాలు పడినంత వరకు అన్ని వ్యవస్థలకు శక్తి లభిస్తుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ కూడా వెల్లడించారు. సూర్యాస్తమం తర్వాత చీకటి కమ్మేసి, చంద్రుడిపై మైనస్ 180 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందని, ఆ పరిస్థితుల్లో వ్యవస్థలు పనిచేయకపోవచ్చని చెప్పారు. ఆ పరిస్థితులను తట్టుకోగలిగి మరుసటి రోజు సూర్య కిరణాల నుంచి శక్తిని పొందగలిగితే వ్యవస్థలు మళ్లీ పని చేసేందుకు అవకాశం ఉంటుందని, అదే జరిగితే చాలా సంతోషిస్తామని సోమనాథ్ తెలిపారు. ఏపీఎక్స్ఎస్ (ఆల్ఫా పార్టికల్ ఎక్స్ రే స్పెక్ట్రోమీటర్) పేలోడ్స్ ద్వారా చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలను రోవర్ సాగిస్తుందని, సేకరించిన డేటాను భూమికి పంపుతుందని ఆయన వెల్లడించారు.

హే...కృష్ణా !

(మొదటిపేజీ తరువాయి)

కావడంతో, ఎగువ నుంచి వస్తున్న వరద సముద్రం పాలవుతోంది. తెలంగాణలో కురిసిన వర్షాలకు గత 15 సంవత్సరాల కాలంలో ఎన్నడూ రానంత వరద మునేరుకు వచ్చింది. కాని ఈ నీటిని నిల్వ చేసుకునే ప్రాజెక్టు దిగువన లేకపోవడంతో ఆ వరద మొత్తాన్ని ప్రకాశం బ్యారేజీ వద్ద మొత్తం 70 గేట్లు పైకెత్తి దిగువకు విడుదల చేశారు. ఇంత వర్షాభావ పరిస్థితుల్లోనూ దాదాపు మూడు లక్షల క్యూసెక్కుల వరద రెండు రోజులపాటు వరుసగా సముద్రం పాలు కావడం గమనార్హం. కృష్ణా నదిపై ఆధారపడి ఒక్క కృష్ణాడెల్టాలోనే 14 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇక సాగర్, శ్రీశైలం, వాటి దిగువన మరికొన్ని ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. రిజర్వాయర్లు ఒట్టిపోతుండడంతో ఈ ప్రాజెక్టులకు సంబంధించిన ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. వర్షాకాలం పూర్తికావస్తున్నా ఇప్పటివరకు సరైన వర్షం పడకపోవడంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఆగస్టులో సైతం సగటు వర్షపాతం కూడా కురవలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈనెలలో ఇప్పటివరకు 132.46 సగటు వర్షపాతానికి గాను 47.58 శాతం మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతం లేకపోవడం విశేషం. ఇదే పరిస్థితి మరో పక్షం రోజులు కొనసాగితే సాగునీటి అవసరాల సంగతి అలా ఉంచి, తాగునీటికి కూడా కటకట ఏర్పడే పరిస్థితి ఏర్పడనుంది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇప్పటికే కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తాగునీటి అవసరాలకు సాగర్, శ్రీశైలం డ్యామ్‌ల నుంచి ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలో తమ వాటాల ప్రకారం నీరు వదలాలని ప్రతిపాదనలు పంపాయి. ఇక ప్రకృతి ఆగ్రహానికి తోడు, పాలకుల నిర్లక్ష్యం కూడా తోడైంది. వాస్తవానికి గోదావరికి వరద ముందుగానే వచ్చినప్పటికీ, పట్టిసీమ ఎత్తిపోతల పథకం మోటార్లు సకాలంలో ఆన్ చేయకపోవడంతో కృష్ణా డెల్టా రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

శాస్త్రవేత్తల ఘనత మోదీ ఖాతాలోకి...

కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 విజయంతో ఇస్రో శాస్త్రవేత్తల ఘనతను ప్రధాని మోదీ తన ఖాతాలో వేసుకున్నారని కాంగ్రెస్ విమర్శించింది. చంద్రయాన్-3 ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగడం ద్వారా ప్రతి భారతీయుడు గర్వంతో ఉప్పొంగిపోయాడని, మిషన్ విజయం అందించిన ఆనందం జీవితాంతం ఉంటుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ నాయకత్వం నిజమైన చరిత్రను సృష్టించిందని కొనియడారు. ఆయనకు, శాస్త్రవేత్తల బృందానికి హృదయపూర్వక అభినందనలను ఎక్స్ మాధ్యమంగా వేణుగోపాల్ తెలిపారు. అదే సమయంలో ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఆయన తన కపటత్వానికి సమాధానం చెప్పాలన్నారు. 'చంద్రయాన్-3 చంద్రుడిపై దిగిన మరుక్షణం స్క్రీన్‌పై ప్రత్యక్షమై ఆ ఘనతను మీ సొంతం చేసుకున్నారు. ఇస్రోకు, శాస్త్రవేత్తలకు తోడ్పాటు అందించడంలో మీ ప్రభుత్వం ఎందుకని ఘోరంగా విఫలమైంది? చంద్రయాన్-3 కోసం పనిచేసిన హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ (హెచ్‌ఈసీ) ఇంజినీర్లకు 17 నెలలుగా జీతాలు ఎందుకు లేవు? కీలక మిషన్ల బడ్జెట్‌లో 32శాతం కోత ఎందుకు? వీరు మన దేశ హీరోలు. ప్రపంచ స్థాయి అంతరిక్ష పరిశోధన కార్యక్రమాన్ని నడుపుతున్నారు. కానీ వారి నైపుణ్యత, సామర్థ్యం, కష్టానికి విలువ ఇవ్వడమే లేదు. పుండుపై కారం చల్లే చందంగా శాస్త్రవేత్తల ఘనతను సొంతం చేసుకున్నారు' అని వేణుగోపాల్ ట్వీట్లలో ఆగ్రహం వ్యక్తంచేశారు

ఖగోళ వనరులపై హక్కులు ఎవరివి?

న్యూఢిల్లీ: భారత్ చేపట్టిన చంద్రయాన్-3 విజయంతో చంద్రుడిపైకి రేస్ మొదలైంది. జాబిల్లిని చేరుకునేందుకు ఆసక్తిగా ఉన్న దేశాలు పెరుగుతున్నాయి. రష్యా ఇప్పటికే విఫలయత్నం చేయగా, చైనా, అమెరికా త్వరలోనే తమ తమ మిషన్లను ప్రకటించబోతున్నాయి. ఇలాంటి సమయంలో అసలు ఖగోళ వస్తువులు, వనరులపై హక్కులు ఎవరికి ఉంటాయన్న ప్రశ్న ఉత్పన్నమైంది. చంద్రుడు ఎవరికి సొంతం కాదు ఇది మొత్తం మానవాళికి చెందుతుంది. అలాంటప్పుడు దానిపై వనరులకు హక్కులు ఎవరివి? అందుకోసం అంతర్జాతీయ చట్టాలు స్పష్టంగా ఉన్నాయా? వంటి ప్రశ్నలు తెరపైకొచ్చాయి. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి 1966లో ఐరాస తీసుకొచ్చిన అంతరిక్ష ఒప్పందం (ఔటర్ స్పేస్ ట్రీటీ) ప్రకారం చంద్రుడు, ఇతర ఖగోళ వస్తువులపై ఏ దేశానికి సర్వాధికారాలు ఉండబోవు. ఆ మేరకు ఏ దేశమూ ప్రకటించుకోకూడదు. మానవాళి ప్రయోజనార్థం ఖగోళ అన్వేషణ జరగాలి. ఈ ఒప్పందంలో ప్రభుత్వాల ప్రస్తావనే ఉంది. చంద్రుడిపై ఏదైనా ప్రాంతం మీద హక్కులను ప్రకటించుకోవచ్చా అన్నదానిపై స్పష్టతలేదు. ఈ నేపథ్యంలో 1979లో మూన్ అగ్రిమెంట్ జరిగింది. దీని ప్రకారం ఏ ప్రభుత్వ, అంతర్జాతీయ, ప్రభుత్వేతర సంస్థలు,

వ్యక్తులు కూడా చంద్రుడిని తమ ఆస్తిగా ప్రకటించరాదు. అక్కడ కాలనీలు ఏర్పాటు చేసుకొని, జాబిల్లి మాదే అనడం చెల్లదు. చంద్రుడు, అక్కడి సహజవ నరులు మానవాళి ఉమ్మడి సొత్తు అని చెబుతుంది. ఈ ఒప్పందం 1984లో అమల్లోకి వచ్చింది. చందమామపైకి ల్యాండర్లు పంపిన అమెరికా, రష్యా, చైనా మాత్రం ఇంకా ఈ ఒప్పందాన్ని ఆమోదించలేదు. అంతరిక్ష ఒప్పందానికి కొనసాగింపుగా అమెరికా 2020లో ఆర్టెమిస్ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. జాబిల్లిపై సురక్షితంగా ప్రయోగాలు చేపట్టడం దీని ఉద్దేశం. ఇందులో కెనడా, జపాన్, యూరప్ తదితర దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. భారత్ కూడా ఇటీవల ఇందులో చేరింది.

ప్రజావ్యతిరేక విధానాలను

ఐక్యంగా తిప్పికొడదాం

న్యూఢిల్లీ:

ప్రభుత్వాల కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని రైతులకు, కార్మికులకు వక్తలు పిలుపునిచ్చారు. తమ హక్కులను, ప్రయోజనాలను పరిరక్షించుకోవాలని సూచించారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరించే కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశంలో క్షీణిస్తున్న పరిస్థితులపై వక్తలు మాట్లాడారు. రైతులు, కార్మికులు, ప్రజలు, జాతి వ్యతిరేక విధానాల అమలుతో దేశ సమగ్రతకు, ఐక్యతకు, ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం జరుగుతోందని మండిపడ్డారు. అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, సామాజిక భద్రత, ఎంఎస్‌పీతో పాటు అనేక అంశాలపై చర్చించేందుకు 10 కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూలు), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సంయుక్త అధ్వర్యంలో దిల్లీలోని తాల్కతోరా స్టేడియంలో గురువారం భారీ బహిరంగ సభ జరిగింది. కార్మిక, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమని నాయకులు ఉద్ఘాటించారు. ఇందుకోసం దేశవ్యాప్త సమ్మె చేపట్టాలన్నారు. 2021లో జరిగిన లఖింపూర్ ఘటనకు గుర్తుగా అక్టోబరు 3న బ్లాక్ డే నిర్వహించాలని, నవంబరు 26, 27, 28 తేదీల్లో రాజ్‌భవన్‌లకు 'మహా పాదవ్' చేపట్టాలని పిలుపునిచ్చారు. డిసెంబరు నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు భారీ నిరసన కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను తీవ్రంగా ఖండించారు. వాటి వల్ల విద్య, బ్యాంకింగ్ రంగాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, పన్ను కోతలు, రుణ మాఫీలు కార్పొరేట్లకే పరిమితమవుతున్నాయని, సామాన్యులపై పన్నుల భారాలు పెరగడంతో వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు దూరమవుతున్నాయని విమర్శించారు. దేశ ఫెడరల్ వ్యవస్థ భ్రష్టుపడుతోందని, విభజన, మతోన్మాద విధానాలు అమల్లోకి వస్తున్నాయని, నిరసన-అసంతృప్తి గళాలను అణచివేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేశారు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటం, విద్యుత్ ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ, బీపీసీఎల్, సీఈఎల్, ఉక్కు పరిశ్రమ ఉద్యోగుల నిరసనలు, ఆందోళనలు విజయవంతమైనట్లు నాయకులు గుర్తుచేశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టం తెస్తామన్న హామీని కేంద్రప్రభుత్వం నిలబెట్టుకోలేదని, విద్యుత్ (సవరణ) బిల్లు ఉపసంహరణలోనూ విఫలమైందని వ్యాఖ్యానించారు. కార్మికులు, శ్రామికులు ఎదుర్కొంటున్న సవాళ్లు, నిత్యావసరాల ధరలు మండిపోవడం, పెరిగిన నిరుద్యోగం, ఉద్యోగ భద్రత లేకపోవడం, కొత్త లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కుల హరణ, వ్యవసాయ, వలస కార్మికుల పరిస్థితులలో క్షీణత, సామాజిక భద్రత కరువు, అనేకమంది పేదరికంలోకి నెట్టబడుతుండటం వంటి అనేక అంశాలను నాయకులు ప్రస్తావించారు. కోవిడ్ కష్టాలు, అణచివేత, దాడులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల గురించీ నాయకులు వివరించారు. సభలో ఏఐటీయూసీ నాయకులు అమర్‌జిత్ కౌర్, అతుల్ కుమార్ అంజాన్, రైతు నాయకుడు రావుల వెంకయ్య తదితరులు మాట్లాడారు.

డిమాండ్లు:

ఎంఎస్‌పీ చట్టం సహా రాతపూర్వకంగా ఇచ్చిన అన్ని హామీలను కేంద్రప్రభుత్వం అమలు చేయాలి. పీఎంఎఫ్‌బీవైని ఉపసంహరించుకోవాలి. పంటల బీమా పథకాన్ని అన్ని పంటలకు వర్తింపచేయాలి. సమగ్ర సాగు రుణాల మాఫీని అమలు చేయాలి. ధరలు నియంత్రించాలి. నిత్యావసరాలపై జీఎస్టీ రద్దు చేయాలి. ఆహార భద్రతకు హామీ ఇవ్వాలి. అందరికీ విద్య, ఆరోగ్య సంరక్షణ కల్పించాలి. జాతీయస్థాయిలో కనీస వేతనాన్ని అమలు చేయాలి. ప్రైవేటీకరణ, ఎన్ఎంపీకి అంతం పలకాలి. కార్మికులందరికీ సమగ్ర సామాజిక భద్రత కల్పించాలి. పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలి, సంపన్నులపై పన్ను విధించాలి. కార్పొరేట్ పన్ను పెంచాలి. ఆస్తి పన్ను పునరుద్ధరించాలి.

విజయవాడలో భారీ అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-విజయవాడ(క్రైమ్): విజయవాడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బెంజిసర్కిల్ సమీపంలోని కాసా టీవీఎస్ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, సెల్స్ సర్వీసెస్ పార్ట్స్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి షోరూంతో పాటు సర్వీసింగ్ షెడ్‌కు వ్యాపించడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కుమ్ముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఏసీపీ భాస్కరరావు, సీఐ కాశీవిశ్వనాథ్, ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే షోరూమ్ మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో షోరూమ్‌లో ఉన్న వందలాపైగా ఎలక్ట్రిక్, పెట్రోల్ వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. షోరూమ్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని

అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. అగ్నిమాపక అధికారులు ఎఫ్‌సీ రిపోర్ట్ ఇచ్చిన తరువాత కారణాలు తెలుస్తున్నాయన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం 5 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగిందని వాచ్‌మెన్...షోరూమ్ యజమాని సుంకర భగత్‌సింగ్‌కు ఫోన్ చేశాడు. యజమాని విదేశాల్లో ఉండటం వలన పూర్తి వివరాలు తెలియాల్సింది. షోరూమ్‌లో 300లకు పైగా కొత్త ద్విచక్రవాహనాలు ఉన్నాయని, అగ్నిప్రమాదం వలన రూ.10 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని సమాచారం.

వర్క్ బుక్‌లు తనిఖీ చేయాలి: ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తరగతి గది నిర్వహణలో భాగంగా జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల వర్క్ నోట్ బుక్‌లను జూనియర్ లెక్చరర్లు తనిఖీ చేసేలా చూడాలని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, తరగతుల నిర్వహణలో విద్యార్థుల డైలీ నోట్ బుక్‌లను పరిశీలించడం ద్వారా, వారు తరగతి గదుల్లో చేయాల్సిన వర్క్ లను చేస్తున్నారో, లేదో తెలుసుకోవచ్చని సూచించారు. జూనియర్ లెక్చరర్ల విధుల్లో ఇది కూడా ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. ఇకపై తన జిల్లా పర్యటనల్లో జూనియర్ లెక్చరర్ల పనితీరుపైనా తనిఖీ చేస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలపై 15 నుంచి ప్రచారం

వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆరోగ్య శ్రీ సేవలు పొందడంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 15 నుంచి ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ సేవలు ఎలా పొందాలన్న దానిపై సమగ్ర వివరాలతో ప్రతి కుటుంబానికీ బుక్‌లెట్ అందించాలని సూచించారు. విలేజ్ క్లినిక్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా పూర్తి వివరాలతో ప్రజలకు సమాచారం అందాలన్నారు. అనారోగ్యం వచ్చినా, దురదృష్టవ శాత్తూ ప్రమాదం జరిగినా ఆరోగ్య శ్రీ కింద ఎలా చికిత్స పొందాలన్న దానిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. వారు ఉంటున్న ప్రాంతానికి అత్యంత సమీపంలోని నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఎలా చికిత్స అందుకోవాలో తెలపాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలు అందుకోవడం గురించి తెలియని వ్యక్తి రాష్ట్రంలో ఉండకూడదని, ఒక్క యాప్‌ద్వారానే కాకుండా ఇతర మార్గాల ద్వారా, ఇతర కాల్ సెంటర్ల ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు పొందడంపై పూర్తి అవగాహన పెంపొందించాలన్నారు. ఆరోగ్య శ్రీ కింద అందే చికిత్సల సంఖ్యను 3,255కి పెంచామని, ఈ సేవలు పొందడంపై ప్రజలకు పూర్తి అవగాహన, సమాచారం ఉండాలన్నారు. సేవలు పొందడంలో ఇబ్బందులు వచ్చినా, లంచాల ప్రస్తావన వచ్చినా ఫిర్యాదు చేసేందుకు ఉద్దేశించిన నంబర్లను ప్రజలకు తెలియచెప్పాలని సీఎం సూచించారు. విలేజ్ క్లినిక్కులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ రంగంలోని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్వహణ అత్యంత సమర్థవంతంగా ఉండాలని, నిర్వహణకు నిధుల సమస్య రాకుండా ఒక విధానం తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇచ్చే ఫీజు రీయిం బర్స్‌మెంట్ డబ్బుల్లోనూ కొంత ఆయా సంస్థల నిర్వహణకు వినియోగించేలా చూడాలన్నారు. ప్రభుత్వ రంగంలో కొత్తగా నిర్మిస్తున్న 17 మెడికల్ కాలేజీల నిర్మాణాల్లో ప్రగతి, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నాడు-నేడు పనులు, ఇతర స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణాలపై సీఎం సమీక్షించారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి డా.మంజుల, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిర ప్రసాద్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ వెంకటేశ్వర్, ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్, వైద్య విద్య డైరెక్టర్ డీఎస్వీఎల్ నరసింహం, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సాంబశివారెడ్డి, ఆరోగ్యశ్రీ సలహాదారు గోవింద హరి, నాడు నేడు డైరెక్టర్ మనోహర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ ఆశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై టీడీపీ దుష్ప్రచారం

సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓట్ల తొలగింపుపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, దొంగే దొంగ అన్నట్టుగా ఆ పార్టీ తీరు ఉందని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ నిజస్వరూపం అందరికీ తెలిసిందేనన్నారు. టీడీపీ గతంలో చేసిన తప్పులను తాము సరిచేశామని, వ్యవస్థలను మేనేజ్ చేసి ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. టీడీపీ అక్రమాలపై తాము గతంలో పోరాడామని, వైసీపీ ప్రజాస్వామ్య యుతంగానే వ్యవహరిస్తోందన్నారు. టీడీపీకి తెలిసిందల్లా అడ్డదారులు తొక్కడమేనన్నారు. చంద్రబాబు తన విద్యలను జాతీయస్థాయిలోనూ ప్రదర్శించారని ఎద్దేవా చేశారు. గోడలు దూకడం, అడ్డదారులు తొక్కడం టీడీపీకి అలవాటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అన్యాయంగా తొలగించిన ఓట్లను తిరిగి చేర్పించాలని, ఉరవకొండలో అక్రమాలు జరిగినట్లు టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని సజ్జల రామకృష్ణారెడ్డి దుయ్యబట్టారు. లక్షలాదిగా దొంగ ఓట్లు ఉన్నాయని, వీటన్నింటినీ ఎన్నికల కమిషన్ తొలిగిస్తే ప్రజాతీర్పు కచ్చితంగా వస్తుందనేదీ తమ నమ్మకమని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో 30 వేల దొంగ ఓట్లు బయట పడ్డాయని, దొంగ ఓట్ల వ్యవహారంలో చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు. టీడీపీ అన్యాయంగా తీసేయించిన ఓట్లను తాము చేర్పిస్తున్నామని సజ్జల చెప్పారు. గతంలో చంద్రబాబు ఓకే ఇంటిపై 770 ఓట్లు చేర్పించారని, టీడీపీ హయాంలో సేవామిత్ర యాప్ ద్వారా వైసీపీ ఓట్లను తొలగించారని గుర్తుచేశారు. ఉరవకొండలో ఓట్ల తొలగింపు ప్రక్రియ సరిగ్గా లేనందున అధికారులపై చర్యలు తీసుకున్నారని, అక్కడ ఎలాంటి దొంగ ఓట్ల నమోదు ప్రక్రియ జరగలేదని నొక్కి చెప్పారు. నాడు ఎన్నికల కమిషన్‌ను చంద్రబాబు బెదిరించారని గుర్తు చేశారు. సీఎం జగన్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, తమకు ఎలాంటి భయం లేదని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సీఎం హామీ మేరకు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు డిమాండు చేశారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ. 18,500 వేతనం ఇవ్వాలని కార్మికులు ఆందోళన చేస్తున్నారని వివరించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా పోరాటాలు చేస్తుంటే వారిపై పోలీసు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని మన్నారు.

బంధువులు చనిపోయి, బాధతో అంత్యక్రియలలో ఉన్న వారిని సైతం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం దారుణమన్నారు. సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి, సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించి మాట నిలబెట్టుకోవాలన్నారు. మున్సిపల్ కార్మిక సంఘాలతో తక్షణమే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు.

26న అమరావతి రైతులతో ముఖాముఖి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-తుళ్లూరు: రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి... అనే నినాదంతో సీపీఐచేపట్టిన బస్సు యాత్ర గుంటూరు జిల్లాలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో తుళ్లూరులో ఈ నెల 26వ తేదీన 'అమరావతి రైతులతో ముఖాముఖి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండల పరిధిలోని మందడం అమరావతి రైతు దీక్ష శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి రైతు దీక్షకు సంఘీభావం తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి రాజధానిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు ముక్కలాట ఆడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీని, రాష్ట్రంలో ఉన్న వైసీపీని గద్దెదించే వరకు సీపీఐ పోరాడుతుందని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధానికి సీపీఐకట్టుబడి ఉందని తెలిపారు. రాజధాని ఉద్యమం ప్రారంభం నుంచి నేటి వరకు ప్రతి పోరాటంలో సీపీఐ ఉందన్నారు. బస్సు యాత్ర 26న రాజధాని ప్రాంతమైన అమరావతి పరిధిలోని తుళ్లూరు మండల కేంద్రంలోకి వస్తుందని, ఆ రోజు ఉదయం రాజధాని రైతులతో తుళ్లూరులో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, మండల కార్యదర్శి గుంటుపల్లి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు శివాజీ, దేవుని దయ, నాగుల్ మీరా, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

షిండేతో గిడుగు రుద్రరాజు భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సుశీల్ కుమార్ షిండేని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. త్వరలోనే ఐదు రాష్ట్రాల సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా రుద్రరాజు చేస్తోన్న వివిధ కార్యక్రమాలపై సుశీల్ కుమార్ షిండే అభినందించారు.

వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర- పార్వతీపురం: దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డితో జరిగిన అభివృద్ధి, సంక్షేమం నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో కొనసాగుతుందని, అభివృద్ధి, సంక్షేమం వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పార్వతీపురం నియోజక వర్గంలోని 75 గ్రామ సచివాలయాల్లో 275రోజులపాటు జరిగిన ా గడప గడపకు మన ప్రభుత్వంౖ కార్యక్రమం ముగింపు సమావేశం గురువారం సాయంత్రం పట్టణంలోని పాత బస్‌స్టాండ్ వద్ద జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి బొత్స మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రస్తుతం రాష్ట్రంలో యాత్రలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్‌ల తీరుపై విరుచుకు పడ్డారు. దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ చెప్పులు చూపించి తన సంస్కారాన్నిచాటుకున్నారని, అలాంటి తీరు వైసీపీలో లేదన్నారు. ప్రజలు తమకు పట్టం కట్టారు కనుక బాధ్యతగా నడుస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అన్ని రకాలుగా రాష్ట్రం అభివృద్ధి జరిగిందన్నారు. వర్షం పడుతున్నా కూడా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దఎత్తున వైసీపీ అభిమానులు రావడం ఆనందంగా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంౖ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎమ్మెల్యే జోగారావును అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్సను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావుతో పాటు జిల్లా వైసీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, నియోజక వర్గ పరిశీలకులు శోభాహైమావతి, తూర్పు కాపు రాష్ట్ర ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాపూజీ నాయుడు, మాజీ జెడ్పీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, పురపాలక సంఘం అధ్యక్షురాలు గౌరీశ్వరి, నియోజక వర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూ మాఫియాను కట్టడి చేయాలి

అనకాపల్లి జిల్లా మహాసభలో ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అనకాపల్లి(నర్సీపట్నం): ఉమ్మడి విశాఖ జిల్లాలో భూమాఫియా పేట్రేగిపోతోందని, పోరాటాల ద్వారా దీనికి అడ్డుకట్ట వేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ హెచ్చరించారు. వేలాది ఎకరాల అటవీ, ప్రభుత్వ భూములు మాఫియా చేతుల్లోకి పోతున్నాయని, ఇక్కడి భూములపై ఇతర ప్రాంతాలకు చెందిన అక్రమార్కుల కన్ను పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో అనేకమార్లు జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టర్ల దృష్టికి తెచ్చినా ఫలితం కనిపించలేదని విమర్శించారు. భూమాఫియా అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం అనకాపల్లి జిల్లా మొదటి మహాసభ నర్సీపట్నంలోని ఎన్జీవో హోమ్‌లో జిల్లా అధ్యక్షుడు శివలంక కొండలరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఆవుల శేఖర్ మాట్లాడుతూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భూ మాఫియా రోజురోజుకు పేట్రేగిపోతోందన్నారు. దళితులు, గిరిజనులు, బడుగు, బల హీన వర్గాలకు సెంటు భూమి కూడా లేకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. పేదలకు భూములు పంచుతామని చెబుతున్నప్పటికీ భూమాఫియా ఆగడాలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని విమర్శించారు. నర్సీపట్నం, కోట ఉరుట్ల, రావికమతం, మాకవరపాలెం, వి.మాడుగుల, కసింకోట, నక్కపల్లి, నాతవరం, చీడికాడ, గోలుగొండ, పాయకరావుపేట మండలాల్లో 40 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పేదలకు ఎలాంటి హక్కులు లేవని, ఆ భూములు మాత్రం భూమాఫియా చేతుల్లోకి వెళ్లిందని వివరించారు. ఆ భూములు పెద్దల చేతికి చిక్కడానికి రెవెన్యూ అధికారులే కారణమన్నారు. ఆశ్చర్యమేమంటే కొంతమంది రెవెన్యూ అధికారులే ఆ భూములకు పట్టాలు తెచుకున్నారని ఆరోపించారు. సాగు చేసుకుంటున్న పేదలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 25, 26, 27 తేదీలలో బాపట్లలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం పేదల హక్కులను కాలరాస్తున్నదని ఆవుల శేఖర్ విమర్శించారు. ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల సంరక్షణ చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యా, వైద్యం, ఆరోగ్యం వంటి అన్ని రంగాలను భ్రష్టు పట్టిస్తున్నదని మండిపడ్డారు. మణిపూర్ హింసపై ప్రధాని మోదీ మౌనం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులు అధిక శాతంలో ఉన్నారని, ప్రభుత్వ భూముల్లో ఉంటున్న గిరిజనులను బలవంతంగా తరమేస్తున్నారని ఆరోపించారు. జగనన్న కాలనీలలో ఎక్కడా ఇళ్ల నిర్మాణం జరగలేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎన్నికల ముందు ప్రజల దగ్గరికి వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు రావు జగ్గారావు మాట్లాడుతూ గతంలో కోండ్రు సుబ్బారావు, భూపతి వెంకట నరసయ్య, మేకా సూరిబాబు వంటి మహనుభావులు పోరాటాలు చేసి వేలాది ఎకరాల అటవీ బంజర్లు, ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామానాయుడు మాట్లాడారు. తొలుత స్థానిక బస్టాండ్ నుండి ఎన్జీవో హోం వరకు భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం జిల్లా నూతన కమిటీని మహాసభ ఎన్నుకున్నది. జిల్లా అధ్యక్షుడిగా అర్జున్, గౌరవాధ్యక్షుడిగా కొండలరావు, కార్యదర్శిగా రామానాయుడుతోపాటు పదిమందిని ఆఫీస్ బేరర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.

మంత్రి మేరుగ నాగార్జునపై సీఈసీకి నక్కా ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జునపై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నేత నక్కా ఆనంద్ బాబు ఫిర్యాదు చేశారు. ఈనెల 23న ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి మేరుగ నిబంధనలకు విరుద్ధంగా పార్టీ సమావేశం ఏర్పాటు చేశారని, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ నాలుగు వేల ఫామ్-7 దరఖాస్తులు పెట్టి... ప్రత్యర్థుల ఓట్లు తొలగించాలంటూ ఆదేశించారని ఆనంద్ బాబు అన్నారు. ఇంటింటి ఓట్ల సర్వే సమయంలో ఇళ్లలో లేని వారి ఓట్లు తొలగించాలని సైతం చెప్పారన్నారు. వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రత్యర్థుల ఓట్లు తొలగించాలని చూడటం దుర్మార్గమని, ఇది ఎన్నికల సంఘం ఆదేశాలకు, నియమ, నింబంధనలకు పూర్తి విరుద్ధమని అన్నారు. ఓటరు అర్హతలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాన్ని పార్టీ సమావేశానికి వాడుకోవడం, ఓట్లు తొలగించాలని కార్యకర్తలను ఆదేశించడం చట్టవిరుద్ధమని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

మళ్లీ అల్పపీడనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో వచ్చే ఐదు రోజులు వానలు పడనున్నాయి. ఈ మేరకు భారత వాతావరణ శాఖ గురువారం ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు పడతాయని, కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అల్పపీడన ప్రభావం వల్ల ఏపీలోని తిరుపతి, ఏలూరు, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 8.9 సెంటీమీటర్లు, అనకాపల్లి జిల్లా చోడవరంలో 4.8 సెంటీమీటర్లు, విజయనగరం జిల్లా డెంకాడలో 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లా పోలవరంలో 2.4 సెంటీ మీటర్ల వర్షపాతం కురిసింది. అటు తెలంగాణ రాష్ట్రంలో కూడా అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణలోని భువనగిరి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, హైదరాబాద్, సూర్యాపేట, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడిస్తూ ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

విజ్ఞాన, ఉపాధికి కేంద్రం... వీఐటీ

విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జి.విశ్వనాథన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అద్భుతమైన విజ్ఞానాన్ని అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వీఐటీ విశ్వవిద్యాలయం ముందంజలోఉండడం తమకు గర్వకారణంగా ఉందని విట్ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జీ.విశ్వనాథన్ అన్నారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో గురువారం ప్లేస్ మెంట్స్, ఉన్నత విద్యలో విద్యార్థులు సాధించిన విజయాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వనాథన్ మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచదానికి కెరియర్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీసీ) దోహదపడుతుందన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో సపోర్టెడ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన విద్యార్థిని, విద్యార్థులకు 100 శాతం అకడమిక్, హాస్టల్ ఫీజులతో పాటు ప్రాథమిక వైద్య ఖర్చులను వీఐటీ యాజమాన్యమే భరిస్తుంది. ఈ సంవత్సరం ఈ కార్యక్రమం ద్వారా చదువుకున్న వీఐటీ విద్యార్థులలో 100 శాతం మంది జాతీయ బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాలను సాధించడం వీఐటీ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయస్థాయిలో ఉన్న గుర్తింపుకు నిదర్శనంగా పేర్కొన్నారు. వీఐటీ కెరీర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వీఐటీ పూర్వ విద్యార్థులతో సమావేశాలను ఏర్పాటు చేయడం ద్వారా, సాంకేతిక, మానవ వనరుల అంశాలలో ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలకు విద్యార్థులు తమను తాము సిద్ధం చేసుకోవడానికి, గ్రూప్ డిస్కషన్స్ సంసిద్ధం అవ్వటానికి సీడీసీ దోహదపడుతుందని తెలిపారు. 2022-23లో వీఐటీ ప్రాంగణ ఎంపికలలో 900 కంపెనీలు... దాదాపు 14,500 ప్లేస్‌మెంట్ ఆఫర్‌లను అందించగా, అందులో 4,500 మంది విద్యార్థులు సూపర్ డ్రీమ్(ఏడాదికి రూ.10 లక్షలకు పైగా జీతం), 3,500 మంది విద్యార్థులు డ్రీమ్ కంపెనీ ఆఫర్(ఏడాదికి రూ.6 లక్షలకు పైగా జీతం), 6,500 మంది విద్యార్థులకు రెగ్యులర్ ఆఫర్‌లతో ఉద్యోగాలను సాధించారని, గరిష్టంగా రూ.1.02 కోట్ల ప్యాకేజీని మోటార్స్ కంపెనీ ఆఫర్ చేసిందని వివరించారు. ఏపీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ, దేశంలోని ప్రముఖ కంపెనీలు, బహుళజాతి సంస్థలు వీఐటీ విద్యార్థుల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, రమణి బాలసుందరం (ట్రస్టీ, వీఐటీ-భోపాల్), డాక్టర్ ఆజాద్ (అసిస్టెంట్ డైరెక్టర్, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్), డాక్టర్ అనుప్రియ (డిప్యూటీ డైరెక్టర్-శిక్షణ, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్), డాక్టర్ శ్రీనివాస రెడ్డి (కోఆర్డినేటర్-కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్), డాక్టర్ అనిల్ నేగి (కోఆర్డినేటర్ -కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్) తో పాటు డీన్స్, డైరెక్టర్లు, విద్యార్థులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

NOTICE

To comply with Order New Delhi, the 24th October, 2015, S.O. 2900 (E) in pursuance to clause 12 and 21 of the Fertilizer (control) Order, 1985 issued by Government of India in the Ministry of Agriculture and Farmer Welfare (Department of Agriculture, Cooperation and Farmers Welfare), M/s. ORO AGRI INDIA PRIVATE LIMITED havingPrincipal address - Gat No-349, Shed No. 2/B, C/o Srujan Health Care, Krupa, Industrial area, At Post Bhare, Tal. Mulshi, Pune, Maharashtra, 412115.hereby notifies that it intends to import and sell following grades of 100% water

Sr. No.	Brand name	Total Nitrogen (as N) %	Total Phosphorus (as P_2O_5) %	Total Potassium (as K_2O) %
1	Turbofert Oro Bloom 11-39-09	11	39	09
2	Turbofert Oro Fill 06-11-39	06	11	39
3	Nutricomplex Orange 10-38-06	10	38	06
4	Nutricomplex blue plus5-10-38	5	10	38
5	Nutricomplex gold 6-24-00	6	24	00
6	Nutricomplex gold 5-25-00	5	25	00
7	Nutricomplex gold 0-9-46	0	9	46
8	Nutricomplex blue 13-40-13	13	40	13
9	Nutricomplex 20-20-20	20	20	20

soluble fertilizers (WSF) as per the specification given below Matter insoluble in water & other heavy metals are within the limits of guidelines are per the specifications given in the above order.

Address for Communication: ORO AGRI INDIA PRIVATE LIMITED, #19-4-648, Shop No. 72, Srinivasa Merchant Welfare Association Complex, Gooty Road, Anantapur, Andhra Pradesh - 515001

Mobile: +91 9100410027,e-mail charan.teja@rovensanext.com

సంపాదకీయం

నిద్ర లేచిన "కాగ్"

మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి ఉందో లేదో అన్న అనుమానం తలెత్తేట్టుగా వ్యవహరించిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వ్యవస్థ కుంభకర్ణుడి అవతారం చాలించి నిద్ర లేచింది. అవినీతిని అరికట్టడానికి అనేక వ్యవస్థలు ఉన్నాయి. అందులో "కాగ్", సీబీఐ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ లాంటివి ప్రముఖమైనవి. ఇవి కాక రాష్ట్రాల స్థాయిలో అవినీతి నిరోధక శాఖలున్నాయి. "కాగ్" రాజ్యాంగ వ్యవస్థ. ప్రభుత్వ ధనం ఎలా ఖర్చు పెడుతున్నారో పరిశీలించడం, అందులో లోటుపాట్లు ఉంటే వెల్లడించడం ఈ సంస్థ ప్రధాన బాధ్యత. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ వ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి సహకరించడమే పనిగా పెట్టుకుంది. రాఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు కుంభకోణం బయటికి వచ్చినప్పుడు "కాగ్" మోదీ ప్రభుత్వానికి అనుకూలమైన నివేదిక ఇచ్చి ఓ పని అయిపోయింది అనిపించుకుంది. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు దాని మీద దేశ భద్రత ముసుగు కప్పేసిన మోదీ ప్రభుత్వం విచారణకు ఆస్కారం లేకుండా చేసింది. ఇటీవల ఆరేడు అవినీతి సంఘటనలను బయట పెట్టడం తప్ప "కాగ్" తొమ్మిదేళ్ల కాలంలో చేసిందేమీ లేదు. ఆర్థిక మంత్రిత్వ శాఖలో భాగమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, సీబీఐ ఈ తొమ్మిదేళ్ల కాలంలో చాలా క్రియాశీలంగా పని చేస్తున్నట్టే కనిపిస్తోంది. కానీ ఈ విభాగం చేసే దాడులన్నీ ప్రతిపక్ష నాయకుల మీదే తప్ప అధికార పక్షం జోలికి వెళ్లిన దాఖలాలే లేవు. లేకపోతే బీజేపీని సమర్థించని ప్రాంతీయపార్టీల నేతల మీదే అని స్పష్టంగా కనిపిస్తోంది. దాడులకు తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు రాజీ పడి బీజేపీలో చేరిపోతే వారు గంగా స్నానం చేసినంత పునీతులై పోతున్నారు. ఇలాంటి నాయకులు కొన్ని డజన్ల మంది ఉన్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు, ఆ తరవాత తాను అవినీతిని అంతమొందించడానికి ఉద్భవించిన అవతార పురుషుడైనట్టు నమ్మించే ప్రయత్నం చేశారు. "నా ఖావుంగా న ఖానే దూంగా" అని ఆకర్షణీయమైన నినాదాల చాటున కేంద్ర ప్రభుత్వ, బీజేపీ నాయకుల అవినీతిని గంప కింద కమ్మేస్తున్నారు. హఠాత్తుగా నిద్రలేచిన "కాగ్" కొద్ది రోజుల కిందే కేంద్ర ప్రభుత్వ పరిధిలో జరిగిన కొన్ని తీవ్రమైన కుంభకోణాల గుట్టు విప్పింది. అందులో ప్రధానమైంది ద్వారకా ఎక్స్ ప్రెస్ వే. ఈఇ రహదారి నిర్మాణానికి కిలో మీటరుకు రూ. 18.20 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ అంచనాను మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదించింది కూడా. అయినా ఇప్పుడా ఖర్చు అమాంతం, నమ్మశక్యంకాని రీతిలో కిలోమీటరుకు రూ. 250.77 కోట్లకు పెంచేశారు. అంటే 14 రెట్లు పెరిగింది. ఈ పథకం అమలుకు కనీసం పథకానికి సంబంధించిన నివేదిక అయినా లేదని "కాగ్" వెల్లడించింది. ఏక పక్షంగా పెంచిన ఈ మొత్తం ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు? దీని మీద దర్యాప్తు ప్రస్తావనే లేదు.

ఈ అవినీతి చిట్టా ఇక్కడితో ఆగిపోలేదు. టోల్ ప్లాజాలు అవినీతికి, ప్రయాణికుల దోపిడీకి నిలయాలుగా మారాయి. "కాగ్" ఉదాహరణ ప్రాయంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళలోని 41 టోల్ ప్లాజాల వ్యవహారాన్ని పరిశీలిస్తే రూ. 132.05 కోట్లు అక్రమంగా ప్రయాణికుల దగ్గర వసూలు చేసినట్టు తేలింది. అలాగే పౌర విమానయాన మంత్రిత్వశాఖ సామాన్యులకు కూడా విమాన ప్రయాణ సదుపాయం కల్పించడానికి "ఉడాన్" (సామాన్యులకు విమాన ప్రయాణ సదుపాయం) పథకం ప్రారంభించింది. 2021 మార్చి నాటికి ఈ సదుపాయాల్లో 52 శాతం మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగతావాటి అంతు చిక్కడంలేదు. ఈ పథకాన్ని 2016లో ప్రారంభించారు. ఇందులో భాగంగా విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని కూడా సంకల్పించారు. కానీ తీరాచూస్తే 30 శాతం కూడా పూర్తి కాలేదు. రైల్వే మంత్రిత్వశాఖ కూడా అవినీతి, అక్రమాలు, అనుచిత ప్రవర్తన విషయాల్లో ఏ మాత్రం వెనకబడి లేదు. ఒక్క 2020–21లోనే అనుమతి లేకుండానే రూ. 8,127.97 కోట్లు ఖర్చు పెట్టేసింది. అలాగే 2021–22 లో అనుమతి లేకుండా రూ. 23, 805.4 కోట్లు వెచ్చించింది. ఈ డబ్బు దుర్వినియోగం అయిందా లేదా, అయితే ఎవరి జేబుల్లోకి ఎలా వెళ్లింది అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. అనుమతి లేకుండానే ప్రజాధనాన్ని వెచ్చించడమే పెద్ద అవినీతి కింద లెక్క ఇంకో వేపు ఖాదీ గ్రామీణ పరిశ్రమలశాఖ అధీనంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాణిజ్య కేంద్రాల ఏర్పాటులో 20శాతం అయినా పూర్తి కాలేదు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ కింద వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు చెల్లిస్తారు. దక్కవలసిన వారికి పింఛన్లు చెల్లించకుండా ప్రధానమంత్రి మోదీకి అత్యంత ప్రీతిపాత్రమైన స్వచ్ఛ భారత్ ప్రచారానికి ఆ డబ్బు వెచ్చించారు. ఈ ఖర్చు 19 రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో ఇలాగే వక్రమార్గం పట్టింది. స్వదేశ్ దర్శన్, అయోధ్య అభివృద్ధి పథకం చిట్టావిప్పినా ఇలాంటి అవినీతి, అక్రమాలే కనిపిస్తున్నాయి. అన్నా హజారే లోక్‌పాల్ కోసం ఉద్యమించినప్పుడు దానికి వెన్నుదన్నుగా ఉన్నది సంఘ్ పరివారేనని అందరికీ తెలుసు. అవినీతి మీద యుద్ధం ప్రకటిస్తానని వాగ్దానం చేసి మోదీ అధికారం సంపాదించారు. అన్నా హజారే ఉద్యమ నేపథ్యంలోనే 2013లో అప్పటి యు.పి.ఎ. ప్రభుత్వం లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు చేసింది. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఈ వ్యవస్థలో అయిదుగురు సభ్యులను నియమించాలి. ఇందులో నలుగురు న్యాయాధీశులు. ఒకరు ఇతరులు. ఈ అయిదుగురిని నియమించడానికి మోదీకి అయిదేళ్లు పట్టింది. అంటే మోదీ దృష్టిలో అవినీతి ఆకర్షణీయమైన నినాదమే మినహా ఆచరించదగిన ఆదర్శం ఎంత మాత్రం కాదు. ఈ మధ్యకాలంలో లోక్‌పాల్ నివేదికల ఊసే వినిపించడం లేదు. ఆ సంస్థ పని చేస్తోందో లేదో తెలియని స్థితిలో పడిపోయింది. కానీ మళ్లీ ఎన్నికలకాలం వచ్చేస్తోంది కనక మోదీ అవినీతి గురించి ఇల్లెక్కి అరుస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీయేతర ఇతర పార్టీలు అవినీతి నిలయాలని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. అన్నింటికీ మించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ సంజయ్ మిశ్రా నియామకం, ఆయన పదవీ కాలం పొడిగింపు చట్టవిరుద్ధం అని సుప్రీంకోర్టు అభిశంసిస్తే ఆయన కోసం ఓ కొత్త వ్యవస్థ ఏర్పాటు చేస్తారన్న వార్తలు వస్తున్నాయి. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్లు ఆ వ్యవస్థకింద పని చేస్తాయట. దానికి అధిపతి సంజయ్ మిశ్రానేనట. ఇంతకన్నా ఘోరం ఏముంటుంది!

అవునా ఇది నిజమా

అవునా ఇది నిజమా మూర్ఖులారా నన్ను నమ్మక చెడిపోతున్నారు. నన్ను నమ్మండి బాగుపడతారు. అవును ఇది నిజమేనా ఏంటి బావ అవునా ఇది నిజమేనా అని పాడుతూ గెంతుతూ వస్తున్నావు. నేను చెప్పింది విని నువ్వు కూడా నిజమని నమ్మి నిజమేలె అనాలి లేకపోతే మన ప్రధాని మోదీ మనసు నొచ్చుకుంటుంది. అసలు విషయం చెప్పవయ్యా బావ. అదె మరి మొత్తం పేపరంతా చదివి విశ్లేషణ చేస్తావ్. ఏమీ తెలియనట్టు అడుగుతావ్ సర్లె చెప్పవయ్యా చెప్పేదేముంది భారతదేశ ప్రజలంతా 2047 కోసం ఎదురు చూడండి అప్పుడు ప్రపంచమంతా స్వర్ణ భారత్, కుభేరుల భారత్ అని నినదిస్తుంది అని మోదీ అంటే అదే మాట చంద్రబాబు కూడ అంటున్నాడు. తనను 2024లో గద్దె నెక్కితే 2047కు స్వర్ణ ఆంధ్రగా మార్చి ప్రతి మనిషికి తానిచ్చే తాయెత్తు కట్టుకున్న చేతికి స్వర్ణకంకణం తొడుగుతానంటున్నాడు. అవునా ఇది నిజమా అని నేను

నిన్ను అడుగుతున్నా. ఇప్పుడు చెప్పు వారిద్దరు చెప్పింది నిజమేనా అని. చూడు ఇంటికి పెద్ద కన్నతల్లిదండ్రులు చెప్పినవి వినక చెడిపోయిన వారు చాలామంది ఉన్నారు. అలాగే దేశ ప్రజలకు మోదీ, రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు అలాంటివారె. నమ్మాలి, నమ్మితీరాలి తప్ప హేళన చేయడం సరికాదు. నాకు తెలియక అడుగుతాను. మనకు స్వాతంత్ర్యం వచ్చి మనల్ని మనమే పాలించుకోవడం మొదలై 52 సంవత్సరాలైంది. మరో 24ఏళ్లు వేచి చూడమంటున్నారు. ఈ మాటలే 1952 ఏర్పడిన మొదటి కాబినెట్ చెప్పిన మాటలు నమ్మాం. వారు ప్రజలకు సేవ చేయడాని వచ్చిన నాయకులు గనుక నమ్మాం. ప్రజలను జలగల్లాగ పీల్చి వేల కోట్లు సంపాదించుకొని ఇతరదేశాల్లో వ్యాపారాల్లో పెట్టిన వారిని కూడ నమ్మమంటే ఎలా. అది సరేనయ్యా నువ్వు నమ్మక చేసేదేమీలేదు. వారిని నమ్మి వారి వెంట జెండా పట్టుకు తిరిగిన వారు కొందరు బాగానే ఉన్నారుగ. నువ్వు కూడా ఆ పని మొదలుపెట్టు. కాని నాకు మనసనేది ఒకటుంది. అది ఒప్పుకోవడం లేదు. నమ్మక ఎదురు తిరిగితే జైలుపాలవుతావు అందుకని నమ్మి తీరాలి. అది నిజమే అనాలి.

భలేవాడివయ్యా ఎలా నమ్మమంటావు. పరమ పవిత్రమైన మోదీ ఆ మధ్య హైద్రాబాదు వచ్చి డబుల్ ఇంజిన్ సర్కారు అవసరమని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలే రాష్ట్రాల్లో కూడా ఉంటే ప్రగతి పరుగులు పెడుతుందన్నారు. అంటే హైదరాబాదులో కూడా బీజేపీ పాలన రావాలి అని. అదే నిజమైతే మరి మణిపూర్‌లో ఉన్నది వారి పాలనే కదా అక్కడ అభివృద్ధి సంగతి అటువుంచి ప్రజలు నరుక్కుని చస్తున్నారు. నిజమే అక్కడ బైటకు కనపడని త్రిబుల్ ఇంజిన్ ఉంది. అది మోదీని పెంచిన విశ్వ హిందుపరిషత్ అనేది అక్కడ సైలెంటు కిల్లరుగ పనిచేస్తోంది. పెంచినవారికి మోదీ ఎదురు చెప్పలేక తలవాల్చడం వలనే అక్కడ ప్రాణాలుమింటి కెగిరి పోతున్నాయి. ఓహో అందుకేనా పార్లమెంటులో సమాధానం చెప్పలేక మౌనమే నా భాష ఓ మూగ మనసా అని మౌనం వహించడం, ప్రతిపక్షాలు అరచినా నోరు విప్పలేదు. చివరకు అక్కడ త్వరలో శాంతి నెలకొల్పుతాం అని ఓదార్చాడు. ఏంటి శాంతి నెలకొల్పేది. ఇన్ని అమానుష సంఘటనలు జరిగినా నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా కూర్చున్నాడు. తన మాత్రం మౌనంగా కూర్చుని ఉన్నాడు. ఆర్ఎస్ఎస్ చేసేది చేస్తూనే ఉంది. అసలు ప్రజాస్వామ్యంలో మనిషికి స్వేచ్ఛ ముఖ్యం. మోదీ ఏమో, నియంతపాలన దిశగా అడుగులు వేస్తున్నాడు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో తానుకోరిన అధికారిని ఎన్నికల అధికారిగా నియమించుకున్నాడు. అది చాలక కోర్టులపై ఆధిపత్యం చెలాయించే దిశగా అడుగులు వేస్తున్నాడు. మరి ఇదంతా నియంతపాలనలో భాగమేగ. అదిసరే అసలు జాతీయ జెండా ఎగురవేస్తూ 2024లో కూడా నేనే ప్రధానిని అనడం ఏంటి బావ. అసలు సందర్భం అదికాదు గద. అది సరే దేశంలో మిలియనీర్లు, కోటీశ్వరులు పెరుగుతున్నారని మిడిల్ క్లాసులో కొంచెం ఎదుగుదల కనపడుతోందని ఈ మధ్య ఒక సర్వే చెప్పింది. మరి లోయరు క్లాసు సంగతేంటి. అట్టడుగున ఉన్న ప్రజల సంగతి కదా ముందు చూడవలసింది ఇక్కడొక ఫిలాసఫి ఉంది. అదేంటంటే బహుజనులు ఉద్యమం చేపట్టినా తన్ని బొక్కలో తోసేయవచ్చు. కాని మిలియనీర్లు పెరగకపోతే ఎన్నికల చందా రాదు. అందుకుని కోటీశ్వరులు పెరగాలి. మనం నిలకడగ కూర్చోవాలి. ఇదే మన ఫిలాసఫి అంటాడు మోదీ. అవునా ఇది నిజమా సరే నోరు మూసుకున్నా.

సెల్: 9885569394

నిగ్గుదేలిన భారత శాస్త్రవేత్తల సత్తా

డా.సోమ మర్ల

భారత్ అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్-3 రాకెట్టు విజయవంతంగా 43రోజుల అనంతరం బుధవారం సాయంత్రం 6.04గంటలకు చంద్రుని ఉపరితలంపై నెమ్మదిగా దిగటం మనందరికి గర్వకారణం. ఆగస్టు 23వ తేదీ చంద్రయాన్-3 నుండి వెలువడిన విక్రమ్ ల్యాండరు చంద్రునిపై దిగిన 4 గంటలకు దానినుండి 'ప్రజ్ఞాన్' రోబో రోవరు బైటకు వచ్చి చంద్రుని ఉపరితలంపై నడవటం మొదలుపెట్టింది. ప్రజ్ఞాన్ చంద్రుడిపై ఒక చంద్ర దినం (అంటే మనభూమిపై 14రోజులకు సమానమైన) సెకండుకు ఒక సెం.మీ వేగంతో సంచరిస్తుంది. ఈ క్రమంలో తన చుట్టూఉన్న వాతావరణం, మట్టి, శిలలు, పర్వతాలు, ఖనిజాలు,నీటి లభ్యత గురించిన సమాచారాన్ని సేకరిస్తుంది. ఇప్పటికే అమెరికా, పూర్వపు సోవియట్ యూనియన్, చైనా దేశాలు చంద్రుని ఉపరితలంపై రాకెట్టు దింపినా, అతి క్లిష్టమైన దక్షిణ ధ్రువప్రాంతంలో అడుగుపెట్టడం మన చంద్రయాన్-3 విశిష్టత. అనేక సాంకేతిక పరమైన ఇబ్బందులతో కూడిన ప్రయోగాన్ని దిగ్విజయంగా సాగించినందు భారత్ శాస్త్రసాంకేతిక ప్రతిష్టను ప్రపంచదేశాలన్నీ ప్రశంసించడం మనజాతికి గర్వకారణం.

చంద్రుని దక్షిణ ధృవం :

అపోలో వ్యోమనౌకనుండి దిగి మొదటిసారిగా చంద్రునిపై (ఆగస్టు, 1969) కాలుపెట్టిన 'సీ ఆఫ్ ట్రాంక్విలిటీ' ఉత్తరప్రాంతం కాంతివంతమైన, చదునైనది, పెద్దగా ఇబ్బందిలేని ఉపరితలం. కానీ దక్షిణ ధృవ ప్రాంతం ఎత్తైన పర్వతాలతో, దాదాపు 8 కి.మీల లోతైన గోతులు, లోయలు, రాళ్లు, శిలలతో నిండిన అతి శీతలమైన చీకటి ప్రాంతం. ఇది చంద్రుని వెనుకభాగం కావటంతో సంవత్సరం పొడవునా సూర్యకాంతి పడక, చీకటిగా -230 డిగ్రీల చలితో ఉంటుంది. సూర్యుడి నుండి భూమి 5.6 బిలియన్ సంవత్సరాల క్రితం వేరుపడగా, ఆ తర్వాత 5.5 బిలియన్ సంవత్సరాల తర్వాత చంద్రుడు భూమి నుండి వేరుపడి భూమిచుట్టూ ప్రదక్షిణలు చేస్తూఉంది. అప్పటి నుండి సూర్యకాంతిలేని అతి శీతలప్రాంతం కావటం వలన భూమి ఏర్పడినప్పటి భౌగోళిక, రసాయనిక పరిస్థితులు ఇంకా చెక్కు చెదరకుండా దక్షిణ ధృవంలో ఉన్నాయని నాసా(అమెరికా) శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో సంచరించే ప్రజ్ఞాన్ రోబో రోవర్‌లో చుట్టూ ఉన్న మట్టి, శిలలు, వాతావరణాన్ని పరిశీలించి, మట్టినమూనాలను, శిలలను రసాయన పరీక్షలుచేసే స్పెక్టోమీటర్లు, లేజరు కిరణయంత్రాలు, ఛాయాచిత్రాలు తీసే కెమెరాలు బిగించారు. సేకరించిన విలువైన సమాచారాన్ని ఇప్పటికే చంద్రుని చుట్టూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న చంద్రయాన్-2 (2019లో ప్రయోగించడమైంది)కి పంపిస్తుంది. చంద్రయాన్-2 ఈ సమాచారాన్ని భూమిపై మన ఇస్రో లేబొరేటరీలకు పరిశోధనకై పంపిస్తుంది. ప్రజ్ఞాన్‌రోవర్ కేవలం 14 భూ దినాలు సంచరిస్తుంది. అది సేకరించవలసిన సమాచారం-ఖనిజసంపద, నీరులభ్యత, వాతావరణం తదితరులు.

నీటి లభ్యత :

2008వ సంవత్సరంలో ప్రయోగించిన చంద్రయాన్-2 రాకెట్టు, చంద్రునిచుట్టూ కక్ష్యలో చక్కర్లు కొడుతూ చంద్రుని గురించి విలువైన సైన్సు సమాచారం పంపింది. అందులోముఖ్యమైనది 'చంద్రునిపై నీరు లభించగల

చంద్రునిపై నీటి లభ్యత అవకాశాలు

అవకాశాలున్నాయని. ఈ విషయాన్ని ఆ తర్వాత ప్రయోగించిన ఉపగ్రహం 92009) సైతం నిర్ధారించింది. అలాగే 2018లో మనం ప్రయోగించిన చంద్రయాన్-2 నీరు, ఐస్, హైడ్రాక్సిన్ మాలిక్యూల రూపంలో ఉన్నదని కనుగొంది (చిత్రం 1). నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, కార్లసన్ (అపోలో) భూమికి తెచ్చిన మట్టి నమూనాలను తిరిగి ఇటీవల పరిక్షించగా నీటి లభ్యత ఆనవాళ్లు లభించాయి. మనిషి చంద్రయానం చెయ్యాలన్నా, అక్కడ అవాసాలు ఏర్పరచుకోవాలన్నా నీటి లభ్యత అత్యావశ్యకం. లక్షల లీటర్లనీరు భూమి నుండి చంద్రుడికి తీసుకువెళ్లడం అసంభవం. నీరు లభిస్తే, మానవయానానికి, నివాసాలకే కాక, దాని నుండి విడగొట్టే హైడ్రోజన్ సైతం రాకెట్ ఇంధనంగా తిరుగు ప్రయాణానికి ఉపయోగపడుతుంది.

ఖనిజసంపద:

చంద్రునిపై, ముఖ్యంగా దక్షిణ ధృవప్రాంతంలో నికెల్, లిథియం, బంగారం, ప్లాటినమ్, మాంగనీసు తదితర విలువైన ఖనిజాలు పుష్కలంగా లభించే అవకాశాలున్నట్లు నాసా, భారత్, సోవియట్ ఉపగ్రహాలు సేకరించిన సమాచారం వెల్లడిస్తున్నది. ఎలక్ట్రానిక్, కంప్యూటరు మైక్రోచిప్స్‌లో వినియోగించే ఖనిజాల లభ్యత భూమిపై అంతంత మాత్రమే. ఈ ఖనిజాల అన్వేషణ జరిగితే, మనదేశ ప్రారిశ్రామికాభివృద్ధికి, అభివృద్ధికి తోడ్పడగలదు. కాగా చంద్రుడిపై అడుగుపెట్టిన దేశాలను, సేకరించిన ఖనిజసంపదపై, వలసలు ఏర్పరచుకోటానికి శాశ్వత యాజమాన్య హక్కులుంటాయా అన్నది శేష ప్రశ్న. కాగా ఐక్యరాజ్యసమితి (ఐరాస) 1966లోనే చంద్రమండలం, దాని సంపద ఏ ఒక్క దేశానికి కాక అన్ని దేశాలకు చెందుతుందని ప్రకటించింది. చంద్రయాన్ 1,2,3 రాకెట్ల ప్రయోగానికి నాందిపలికిన పరిశోధనలకు కేంద్రం ఇస్రో, భారత్ అంతరిక్ష పరిశోధనాసంస్థ (మొదట్లో దీని పేరు INCOSPAR)ను మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1962లో స్థాపించారు. ఆ తర్వాత 1969లో విక్రమ్ సారాభాయి, సతీష్‌ధావన్ వంటి శాస్త్రజ్ఞులు దీనిని అభివృద్ధిచేసి ఇస్రోగా నామకరణం చేశారు. అర్యభట్ట, ఇన్‌సాట్ తదితర అనేక ఉపగ్రహాలు ప్రయోగించే మనం నిత్యం వినియోగించే టీవీ, టెలిఫోన్ అంతర్జాత స్పెక్ట్రమ్, వాతావరణ, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయ తదితర సమాచార సేకరణకు ఉపయోగించేవారు. కాగా 1990వ దశకం నుండి గ్రహాంతర వ్యోమనౌకల అభివృద్ధిని, సాంకేతికతను ప్రారంభించారు. 90వ దశకంలో రాకెట్లలో వినియోగించే ద్రవశీతల ఇంధనాన్ని (క్రియోజెనిక్ ఫ్యూయల్)ని సరఫరాను నిరాకరించి భారత్ అంతరిక్ష పరిశోధనలను అడ్డుకోవాలని ప్రయత్నించినా మన శాస్త్రజ్ఞుల కృషి ఫలితంగా నేడు చంద్రయాన్-3 రాకెట్ ప్రొపల్షన్‌లో, గమనంలో వినియోగించే ఈ ఇంధనాన్ని మనశాస్త్రజ్ఞులే తయారుచేయడం గర్వకారణం. చంద్రయాన్ రాకెట్ ప్రయోగంలోని వివిధ దశలైన రాకెట్ ప్రొపల్షన్, చంద్రుని కక్ష్యలోకి ప్రవేశపెట్టడం, రాకెట్ నుండి విక్రమ్ లాండర్‌ను (ప్రజ్ఞాన్ రోబోను కల్గి ఉన్నా) విడగొట్టి, లాండరును సురక్షితంగా చంద్రునిపై దింపటం, ప్రజ్ఞాన్ చలనం, సమాచారసేకరణ, భూమి నుండి పంపే సూచనలకు అనుగుణంగా పనిచెయ్యటం, భూమికి తిరిగి సమాచారాన్ని పంపటం సాంకేతికలతో కూడినది, క్లిష్టమైనది. దీనిలో ఉపయోగించిన మౌలిక సదుపాయాల రూపకల్పన, కంప్యూటరు అల్గారిథమ్‌లు, సాఫ్ట్‌వేర్, రాకెట్టు, లాండరు,రోవర్ నిర్మాణం కేవలం స్వశక్తితో మన శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు చేయగలిగారు. వీరిలో ప్రధానపాత్ర వహించిన ప్రాజెక్టు డైరెక్టర్లు సోమనాథ్, డిప్యూటీ డైరెక్టరు వేరు ముత్తువేలు, ఉన్ని కృష్ణన్ సాయరు, డా.రిటూ కిరండాల్, శ్రీమతి కల్పన, శంకరన్ ప్రముఖులు. వీరే కాక 56 మంది మహిళా ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు ఎంతో తోడ్పడ్డారు. దాదాపు 60 సంవత్సరాల ఇస్రో చారిత్రకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిచేసి, ప్రత్యక్షంగా చేసి నిరూపించిన వందలమంది శాస్త్రజ్ఞులకృషి ఎంతో ప్రశంసనీయం. వీరికి జేజేలు. కాగా ఇప్పటివరకు పుష్పక విమానాలు, మంత్రోచ్ఛరణతో గ్రహాంతరయానం చేయవచ్చని పుక్కిట పురాణాలు, మూఢ విశ్వాసాలను ప్రచారంచేస్తూ వచ్చిన మతోన్మాదులు చంద్రయాన్ ప్రయోగానికి ముందు తిరుపతి వెంకటేశ్వరుని ఆశీస్సులు పొందటం, గత రెండు, మూడు రోజులుగా చంద్రయాన్-3 విజయాన్ని కాంక్షిస్తూ హోమాలు, పూజలు గుళ్లలో చేస్తూవచ్చారు. అంటే ఎంతో కృషిచేసి శాస్త్రజ్ఞులు రూపొందించిన రాకెట్ ప్రయోగాలపై నమ్మకం, గౌరవం చూపకుండా కేవలం భగవంతుని ఆశీస్సులతో, కృపతో చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరటం అశాస్త్రీయం. ఇది శాస్త్రజ్ఞుల కృషిని, సైన్సుని అవమానపరచటమే. కాగా చంద్రయాన్ ప్రయోగాలను టీవీలో, యూట్యూబ్‌లో ఉత్కంఠతో వీక్షించిన పాఠశాల, కాలేజీ విద్యార్థుల జిజ్ఞాస, ఉత్సుకత ప్రశంసనీయం. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెరగటం భవిష్యత్‌లో భారతదేశ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి శుభసూచకం. ప్రస్తుత గ్రహాంతర యానాలు, పరిశోధనలు, సైన్సు ఆవిష్కరణలు కంపెనీలకు లాభాలు తెచ్చేవిగా కాక ప్రజాసంక్షేమానికి, సామాజికాభివృద్ధికి, ఉపయోగపడగలవని ఆశిద్దాం. ఇంతటి విజయానికి మూలమైన శాస్త్రవేత్తలకు గత నాలుగునెలలుగా ఇవ్వని వేతనాలను తక్షణం చెల్లించాలి. అలాగే శాస్త్రవేత్తలకు పురస్కారాలు ఇవ్వాలి.

ప్రధాన శాస్త్రవేత్త (రిటైర్డ్)
ఐసీఏఆర్, న్యూఢిల్లీ

మితిమీరిన దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

డాక్టర్ సీ.ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

దేశంలో పేరెన్నికగన్న దర్యాప్తు సంస్థలు బీజేపీ పంజరంలో చిలకలేనని తేటతెల్లమైంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్ఐఏ) లు రాజ్యాంగం పరిధిలో చాలా స్వతంత్రంగా పని చేయాల్సిన దర్యాప్తు సంస్థలు. నేడు ఇవి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పినట్టు నడిచే సంస్థ లయ్యాయనేది తాజా చర్చ. దీనికి పార్లమెంటులోనే బలం చేకూరింది. ఈ నెల మొదటివారంలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి పార్లమెంటులో మాట్లాడారు. అదే సమయంలో ప్రతిపక్షసభ్యులు మణిపూర్ అల్లర్లపై ప్రధాని నోరు విప్పాలంటూ డిమాండు చేస్తున్నారు. కోపోద్రిక్తురాలైన ఆ మంత్రి 'మీరు నోరు మూయండి లేదంటే మీ ఇంటికి ఈడీ వస్తుంది' అని ప్రతిపక్ష నేతలను తీవ్రంగా హెచ్చరించారు. నిండు సభలో ఈడీ పేరుతో ప్రతిపక్షాలను బెదిరించడాన్ని తక్కువగా చూడలేము. బీజేపీ, మోదీని విమర్శించినా, ప్రశ్నించినా జైల్లో పెట్టడమే ఈడీ పని అని ఆమె చాలా స్పష్టంగా ప్రకటించారు. ఆమె వ్యాఖ్యలు యాదృచ్ఛికం కాదు. గత తొమ్మిదేళ్లుగా ఈడీ, సీబీఐ, ఎన్ఐఏల పని తీరును గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

మోదీ పాలనలో రోజూ వినిపిస్తున్న పేరు ఈడీ. ఫారిన్ ఎక్స్చేంజ్ రెగ్యులేషన్ యాక్టు -1947ను ఉల్లంఘించిన కేసుల దర్యాప్తునకు 1956 మే 1 న కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో ఏర్పాటైన చిన్న సంస్థకు 1957లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గా పేరు మార్చారు. 1960లో రెవెన్యూశాఖ పరిధిలోకి వచ్చింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్-2002 అమల్లోకి రావటంతో ఈడీకి విశేషాధికారాలు వచ్చాయి. ఆర్థిక నేరాలు జరిగే అవకాశముందని భావిస్తే ఎవరినైనా ముందుగానే అరెస్టు చేసే అధికారం ఈడీకి వచ్చింది. మోదీ అధికారంలోకి రావడంతో ఈడీ లక్ష్యాలు పూర్తిగా మారిపోయాయి. 2014 నుంచి దాదాపు 121 మంది రాజకీయ నేతలపై ఈడీ కేసులు నమోదయ్యాయి. ఇందులో 115 మంది ప్రతిపక్ష నేతలే కావడం గమనార్హం. ప్రస్తుత అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్నప్పుడే ఆయనపై ఈడీ కేసులు నమోదయ్యాయి. ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈడీ కేసులు మరుగున పడ్డాయి. బీజేపీ తరపున సీఎం అయ్యారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి అప్పుడైన సువేందు అధికారిపై ఈడీ దృష్టి పెట్టింది. ఆయన టీఎంసీని వీడి బీజేపీలో చేరారు. దర్యాప్తు నిలిచిపోయింది. టీడీపీ ఎంపీలైన సుజనాచౌదరి, సీఎం రమేశ్‌లు ఈడీ కేసులు ఎదుర్కొంటూ బీజేపీలో చేరి తప్పించుకున్నారు. మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వాన్ని కూల్చడంలోనూ ఈడీ పాత్ర ఉందని, సీఎం ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేయకపోతే జైలు తప్పదని కొందరు ఎమ్మెల్యేలను ఈడీ బెదిరించినట్టు ఆరోపణలు వచ్చాయి. అదే తరుణంలో బీజేపీ పెద్దల మాట వినని శివసేన ఎంపీ సంజయ్ రౌత్‌ను అరెస్టు చేసిందనేది ఉద్ధవ్ వర్గం వాదన. కొద్ది నెలల కిందట కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకను ఈడీ టార్గెట్ చేసింది. ఈ తరుణంలోనే ఈడీ డైరెక్టర్ పదవీ కాలం నిత్యం పొడగింపు విషయంలో సుప్రీం కోర్టు ఇటీవల ఘాటు వ్యాఖ్యలు చేసింది.



బ్రిటిష్ కాలంలోనే స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎస్‌పీఈ) చట్టం ప్రకారం సీబీఐని ఏర్పాటు చేశారు. లంచం, అవినీతి కేసులను దర్యాప్తు చేయడం దీని కర్తవ్యం. దీనికి 1946లోనే స్వయం ప్రతిపత్తి ఇచ్చారు. లాల్‌బహదూర్ శాస్త్రి కేంద్ర హోంమంత్రిగా (1961) ఉన్నప్పుడు దీనికి సీబీఐగా పేరు మార్చారు. వ్యవస్థీకృత, తీవ్రమై నేరాలు, కేంద్ర ద్రవ్య చట్టాల్లో అవకతవకలపైనా దర్యాప్తు చేసే వీలు కల్పించారు. 1980 నుంచి సీబీఐ అధికార పార్టీలు రాజకీయ ప్రతీకారాల కోసం వాడుకోవటం ప్రారంభించాయి. 2013లోనే సుప్రీంకోర్టు సీబీఐని 'పంజరంలో చిలక' అని వ్యాఖ్యానించడం గమనార్హం. తాజాగా సీబీఐ బీజేపీ జేబు సంస్థగా మారినట్టు ఆరోపణలున్నాయి. ప్రతిపక్ష నేతల్ని కాషాయం కండువా కప్పుకునేలా చేయడం సీబీఐ విధిగా మారిందనే చర్చ నడుస్తోంది. జీఎస్టీ ఎగవేత కేసులో దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను టార్గెట్ చేసి ఆయన్ను బీజేపీలో చేరాలని బెదిరించిందనే విమర్శలు వచ్చాయి. ప్రభుత్వానికి కొరకాని కొయ్యగా మారిన ఎన్డీటీవీని కూడా సీబీఐ టార్గెట్ చేసింది. ఆ సంస్థ యజమానులు ప్రణయ్‌రాయ్, రాధికారాయ్‌లు నకిలీ కంపెనీలు సృష్టించి పెట్టుబడులు రాబట్టారని కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి చివరికి ఆ సంస్థ అదానీ చేతుల్లోకి చేరేందుకు సీబీఐ కారణమైందనే విమర్శ ఉంది. మోదీ పాలనకు ముందు యూపీఏ పాలనలో 72 మంది రాజకీయ నాయకులపై సీబీఐ కేసులు నమోదు చేసింది. 43 మంది విపక్ష పార్టీ నేతలు ఉండగా అందులో 29 మంది అధికార పార్టీ నేతలు ఉన్నారు. కానీ 2014లో మోదీ పగ్గాలు చేపట్టినాక ఎనిమిదేండ్లలో కేసులు కేవలం ప్రతిపక్షాలకు చెందిన నాయకులపైనే 118 కేసులు నమోదయ్యాయంటే సీబీఐ ఎవరి ఏమి చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. విపక్షాల నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకోగానే వారిపై సీబీఐ విచారణ అర్థాంతరంగా నిలిచిపోయిన ఘటనలనేకం. బెంగాల్ శారదా కుంభకోణం కేసులో మాజీ మంత్రి, మమత అనుచరుడు ముకుల్ రాయ్ బీజేపీ తీర్థం పుచ్చుకోగానే సీబీఐ చల్లబడింది. ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై నమోదైన కేసుల్లోనూ కేంద్రం ఆదేశాల మేరకే సీబీఐ మిన్నకుంటోందని ప్రతిపక్ష టీడీపీ అంటోంది. టీడీపీ అధినేత చంద్రబాబుపై ఉన్న కేసుల్లో సీబీఐ దూకుడు పెంచకుండా ఉండేందుకే ఆయన బీజేపీకి వత్తాసు పలుకుతున్నాడనే వ్యాఖ్యలు ఏపీలో సాధారణమయ్యాయి. తెలంగాణ సీఎం కేసీఆర్ సీబీఐ, ఈడీల పనితీరును వాషింగ్ పౌడర్ నిర్మా అంటూ ఆధారాలతో సహా ఎండగట్టిన వీడియో బాగా వైరల్ అయ్యింది. బీజేపీకి అనుకూలమైన పార్టీ విషయంలో ఒకలా, వ్యతిరేకమైతే మరోలా సీబీఐ వ్యవహరిస్తున్నట్టు ఆ వీడియో స్పష్టం చేసింది. కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉండగా మంత్రి ఈశ్వరప్పపై తీవ్రమైన అవినీతి ఆరోపణలొచ్చాయి. బీజేపీకి చెందిన కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకున్నా కనీసం కేసు కూడా నమోదు కాలేదంటే సీబీఐ పని తీరును మనం అర్థం చేసుకోవచ్చు. ఈ కారణంగానే ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మిజోరం, పంజాబ్, రాజస్థాన్, బెంగాల్, మేఘాలయ, తెలంగాణ రాష్ట్రాలు తమ అనుమతి లేకుండా తమ రాష్ట్రంలో సీబీఐని అడుగు పెట్టకుండా అనుమతి నిరాకరించాయి.

ఉగ్రదాడులను నిరోధించటం, దాడుల దర్యాప్తు కోసం 2008 నాటి ముంబై ఉగ్రదాడుల తర్వాత యూపీఏ ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)ని ఏర్పాటు చేసింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే ఈ సంస్థ పనితీరు కూడా నిత్యం వార్తల్లోకి వస్తోంది. 2020లో ప్రారంభమైన భీమా కోరేగావ్ కేసు దర్యాప్తులో ఎన్ఐఏ తీవ్రవిమర్శల పాలైంది. ఈ సంస్థను కూడా బీజేపీ తమ ప్రతీకారం తీర్చుకునే వేదికగా మార్చుకుందనే ఆరోపణలు ముమ్మరమయ్యాయి. బీజేపీ విధానాలను తీవ్రంగా విమర్శించే మేధావులు, ప్రొఫెసర్లు, పౌర హక్కుల నేతలు. జర్నలిస్టులను ఎన్ఐఏ అరెస్టు చేసి జైళ్లలో పెట్టడంతో పాటు కనీస విచారణ చేయకుండానే బెయిల్ దక్కకుండా అడ్డుకొంటోందనే విమర్శలున్నాయి. గిరిజన హక్కుల నేత 83 ఏండ్ల స్టాన్‌స్వామి ఎన్ఐఏ కేసులో అరెస్టయి బెయిల్ రాకుండా ఆరోగ్యం పూర్తిగా క్షీణించి కస్టడీలోనే మరణించడం ఈ సంస్థ పని తీరును బహిర్గతం చేస్తోంది. అవినీతి అరోపణలు చేసేందుకు అవకాశం లేక ఉద్యమకారులు, వాపపక్ష పార్టీల కార్యకర్తలను టార్గెట్ చేయడంతో ఎన్ఐఏకి బీజేపీ తర్ఫీదు ఇస్తోందని ప్రజాసంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ రాజకీయ పంజరంలో చిక్కుకున్నట్టు ఆరోపణల్ని ఎదుర్కొంటున్న దర్యాప్తు సంస్థలు తమ తీరును రాజ్యాంగ బద్ధంగా మార్చుకోవడం ద్వారానే సామాన్యుల నమ్మకాన్ని పొందగలవు.

9059837847

భళా భారత్

కీర్తించిన అంతర్జాతీయ మీడియా

చంద్రయాన్-3 విజయంపై వార్తాకథనాలు

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. అంతరిక్ష పరిశోధన రంగంలో తనదైన ముద్ర వేసింది. అగ్రరాజ్యాలకు సాధ్యం కాని పనిని చేసి చూపింది. అందరి మన్ననలు పొందుతోంది. ఇప్పటివరకు ఎవరు కాలుమోపని చంద్రుడి అవతల పక్కకు చంద్రయాన్ ల్యాండర్ విక్రమ్ చేరుకుంది. రోవర్ ప్రజ్ఞా ద్వారా నమూనాల సేకరణను ప్రారంభించింది. ఈ చారిత్రక ఘట్టాన్ని భారతీయులే కాదు ప్రపంచ దేశాలు ఆసక్తిగా వీక్షించాయి. భారత్ గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసించాయి. అంతర్జాతీయ మీడియా సైతం చంద్రయాన్-3 విజయాన్ని కీర్తించింది. న్యూయార్క్ టైమ్స్ నుంచి బీబీసీ వరకు, ది గార్డియన్ నుంచి ది వాషింగ్టన్ పోస్టు వరకు చంద్రయాన్-3 ద్వారా భారత్ చరిత్ర సృష్టించిందని పతాక శీర్షికలు వెలువడ్డాయి. అమెరికాలోని ప్రధాన పత్రికలన్నీ వార్తలు, కార్టూన్ల ద్వారా భారత్ ఘనతను చాటాయి. చంద్రుడి అవతలి పక్కకు చేరిన తొలిదేశంగా న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఈ చరిత్రాత్మక ఘటాన్ని వేడుక చేసుకునేలా కొన్ని కథనాలను ది వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించింది. భారత్ చంద్రమండాన్ని చేరిందని ది వాల్ స్ట్రీట్ జర్నల్ వార్తలిచ్చింది. చంద్రయాన్-3

చరిత్ర సృష్టించిందని బీబీసీ పేర్కొంది. సాఫ్ట్ ల్యాండింగ్ చేసి అమెరికా, చైనా, నాటి సోవియట్ యూనియన్ సరసన భారత్ నిలిచిందని సీఎన్ఎన్ కొనియాడింది. చంద్రుడిపై వనరులను అన్వేషించే రేసులో భారత్ అడుగు పెట్టిందని ది టెలిగ్రాఫ్ పేర్కొంది. గొప్ప విజమంటూ స్కైన్యూస్ శ్లాఘించింది. ది ఇండిపెండెంట్ వార్తాపత్రిక, జపాన్ దినపత్రిక నిక్కే, ది ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ కోసం భారత్‌ను ప్రశంసిస్తూ కథనాలు వెలువరించాయి. అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌కు ఎంతో ఉత్సాహకర సమయమిదంటూ యూసీఎల్ ముల్లార్డ్ స్పేస్ సైన్స్ ల్యాబ్ ప్రొఫెసర్ ఆండ్రూ కోయేట్స్ అభిప్రాయపడ్డారు. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 దిగ్విజయంగా చంద్రుడి అవతలి పక్కకు చేరుకొని చరిత్రకెక్కిన వేళ దయాది దేశం పాకిస్తాన్ కూడా భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించింది. ఆ దేశ మీడియాలో అనేక కథనాలు వెలువడ్డాయి. జియో న్యూస్, ది న్యూస్ ఇంటర్నేషనల్, ది డాన్, ది బిజినెస్ రికార్డన్, దునియా న్యూస్ తదితర వార్తాసంస్థలన్నీ భారత్, ఇస్రోను కీర్తించాయి. చంద్రయాన్-3 చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం కూడా చేశాయి.

మిమ్మల్ని చూసి గర్విస్తున్నాం: శ్రీలంక

భారత్ చరిత్రక విజయంతో శ్రీలంక గర్విస్తోందని ఆదేశాధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె వెల్లడించారు. ప్రధాని మోదీకి, ఇస్రో, బృందానికి, ప్రతి ఒక్క భారతీయునికి శుభాకాంక్షలు తెలిపారు. తాజా ప్రయోగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి మరింతగా ప్రోత్సాహాన్ని ఇస్తుందని విక్రమసింఘె పేర్కొన్నట్లు అధ్యక్ష కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

రాహుల్ కంచుకోట అమేథీ: రాయ్

అమేథీ: ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ లోక్‌సభ నియోజకవర్గానికి, తరతరాలుగా కాంగ్రెస్ పార్టీకి మధ్య గట్టి బంధం ఉందని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ఇక్కడి ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించి తిరిగి అమేథీని అప్పగిస్తారని యూపీ కొత్త పీసీసీ అధ్యక్షుడు అజయ్ రాయ్ గురువారం ఆశాభావం వెలిబుచ్చారు. వారణాసి నుంచి లక్నో వెళుతూ మార్గమధ్యలో రాయ్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ స్మృతి ఇరానీ మాదిరిగా రాహుల్‌గాంధీ అమేథీ ప్రజలను ఎప్పటికీ వదులుకోబోరని చెప్పారు. అమేథీ నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేయాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. రాహుల్‌కు ఐదు లక్షల ఓట్ల మెజారిటీ ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి పనుల విషయంలో మంత్రి స్మృతి ఇరానీ అమేథీ ప్రజలను మోసం చేస్తున్నారని, ఆమె గిమ్మిక్కులను ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. రాహుల్ అమేథీకి వస్తున్నారన్న వార్తతో ఇరానీ రెండురోజుల పర్యటన కోసం ఇక్కడికి వస్తున్నారని ఆరోపించారు. ఆమె ఇంటింటికీ తిరగవచ్చుని, అయినా అమేథీ ప్రజలు రాహుల్ కుటుంబం వెనుక ఉన్నారని, అందువల్ల ఆమెకు ఒరిగేదేమీ లేదని అజయ్ రాయ్ వ్యాఖ్యానించారు. స్మృతి ఇరానీ 2019లో గెలిచేంత వరకూ అమేథీ గాంధీ కుటుంబానికి కంచుకోట అని గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ ఇక్కడి నుంచి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారన్నారు. రాహుల్‌కు ముందు సోనియా, రాజీవ్ గాంధీ కూడా ఇక్కడి నుంచే ఎంపీలుగా పనిచేశారని వివరించారు.

ప్రపంచ దేశాధినేతలకు మోదీ ధన్యవాదాలు

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 విజయవంతం కావడంపై అభినందన సందేశాలు పంపిన ప్రపంచదేశాధినేతలకు ప్రధాని నరేంద్రమోదీ ధన్యవాదాలు తెలిపారు. చంద్రునిపై కష్టసాధ్యమైన దక్షిణ ధ్రువంపై భారత్ అడుగుపెట్టడం శాస్త్ర సాంకేతికరంగం వల్లే సాధ్యమైందని మోదీ పేర్కొన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరి నుంచి నాకు అభినందన సందేశాలు వచ్చాయి. ఈ విజయం కేవలం ఒక్క దేశానికే పరిమితం చేయడం సరికాదు. యావత్ మానవత్వానికి ఈ విజయం దక్కుతుంది. ఇది మనందరికీ గర్వకారణం. యావత్ ప్రపంచం తరఫున భారతీయ శాస్త్రవేత్తలకు ధన్యవాదుల చెప్పడానికి ఇదో అవకాశంగా భావిస్తున్నాను' అని జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల సందర్భంగా మోదీ పేర్కొన్నారు. దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంతో భారత్ గొప్ప విజయం సాధించడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తల కుటుంబానికీ విజయమేనని తెలిపారు. భారత్ లక్ష్యం విజయవంతమైందని చెప్పారు. క్లిష్టమైన ప్రాంతంలో రోవర్‌ను ల్యాండ్ చేయడం సైన్స్ గొప్పతనమని వ్యాఖ్యానించారు. ఇది సైన్స్, సైంటిస్టులు సాధించిన విజయమని తెలిపారు.

చంద్రయాన్‌కు భిన్న సంస్థల సహకారం

అనేక విడిభాగాలు, వస్తువులు, పదార్థాల సరఫరా

న్యూఢిల్లీ: చంద్రుడి రహస్యాలపై పరిశోధనల కోసం చేపట్టిన ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-3 మిషన్ బుధవారం సాయంత్రం చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన సంగతి విదితమే. అయితే ఇస్రో రూపొందించిన చంద్రయాన్-3 అంతరిక్ష వ్యోమనౌక అభివృద్ధికి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు సహాయ సహకారాలందించాయి. ఆయా సంస్థల జాబితా... వాటి సహకారం ఏంటో తెలుసుకుందాం:

- టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ లిమిటెడ్ (టీసీఈ)... అంతరిక్ష యాత్ర ప్రయోగం విజయవంతానికి అనువైన క్లిష్టమైన వ్యవస్థలు, ఉప-వ్యవస్థలను రూపొందించింది. ఇందులో సాలిడ్ ప్రొపెల్లెంట్ ప్లాంట్, వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్, మొబైల్ లాంచ్ పెడెస్టల్ ఉన్నాయి.
- లార్సెన్ & టూబ్రో (ఎల్&టీ) చంద్రయాన్-3 కోసం వివిధ భాగాలను సరఫరా చేసింది. 'మిడిల్ సెగ్మెంట్, నాజిల్ బకెట్ ఫ్లాంజ్' వంటి భాగాలు పొవాయ్‌లోని ఎల్&టి కర్మాగారంలో తయారు చేయగా, గ్రౌండ్, ఫ్లైట్ ప్లేట్‌లను కోయంబత్తూరులోని ఏరోస్పేస్ తయారీ కేంద్రంలో ఉత్పత్తి చేసినట్లు కంపెనీ వెల్లడించింది.
- వాల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్ 80 అడుగుల ఎత్తు, 12 అడుగుల కంటే ఎక్కువ వ్యాసార్థం కలిగిన చంద్ర మిషన్ వాహనం, మొదటి దశ బూస్టర్, ఫ్లెక్స్ నాజిల్ కంట్రోల్ ట్యాంకుల విడి భాగాలను తయారు చేసింది.
- గోద్రెజ్ అండ్ బాయ్‌సే ప్రధాన దశ కోసం ఎల్110 ఇంజిన్ తయారీకి, అత్యంత బరువైన లాంచర్ అయిన ఎల్‌విఎం3 (లాంచ్ వెహికల్ మార్క్-3)అప్పర్ స్టేజ్ కోసం సీఈ20 ఇంజిన్ థ్రస్ట్ చాంబర్ తయారీకి సహకరించింది.
- ఎల్‌విఎం3 ఎం4/ చంద్రయాన్-3 మిషన్‌కు సెంటం ఎలక్ట్రానిక్స్ 200కు పైగా మిషన్-క్రిటికల్ మాడ్యూల్స్, సబ్‌సిస్టమ్‌లను అందించింది.
- ఆన్-బోర్డ్ కంప్యూటర్‌లు, నావిగేషన్ సిస్టమ్, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, టెలిమెట్రీ, పవర్ సిస్టమ్‌ల వంటి అనేక ఏవియానిక్స్ ప్యాకేజీలను అమలు చేయడంలో అనంత్ టెక్నాలజీస్ (ఏటీఎల్) లాంచ్ వెహికల్ (ఎల్‌వీఎం3)కి సహకరించింది. వివిధ ఇంటర్‌ఫేస్ ప్యాకేజీలు, పవర్ స్విచింగ్ మాడ్యూల్స్, రిలే బ్యాలెన్సింగ్ యూనిట్‌లను కూడా అందించింది. చంద్రయాన్-3 ప్రోగ్రామ్ కోసం టెలిమెట్రీ, టెలికమాండ్, పవర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ సహా అనేక ప్రధాన ఉపగ్రహ వ్యవస్థలను ఏటీఎల్ అందించింది.
- ప్రగ్యాన్ రోవర్‌లో చిత్రాలను ప్రాసెస్ చేయడానికి ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌ను ఓమ్నిప్రెసెంట్ రోబోటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ రూపొందించింది.
- సెమీకండక్టర్ లాబొరేటరీ (ఎస్‌సిఎల్)... ఎల్‌విఎం లాంచ్ వెహికల్ నావిగేషన్ కోసం తయారు చేసిన విక్రమ్ ప్రాసెసర్ (1601 పీఈ01), విక్రమ్ ల్యాండర్ ఇమేజర్ కెమెరా కోసం బోర్డు మీద ఎగురవేయబడిన సీఎంఓఎస్ కెమెరా కాన్ఫిగరేటర్ (ఎస్‌సి1216-0) రూపొందించింది.
- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)... చంద్రయాన్-3లో వెళ్లిన రోవర్, ల్యాండర్ కోసం లోహ మిశ్రమ నిర్మాణాలు, ప్రొపెల్లెంట్ ట్యాంకులు, బస్సు నిర్మాణాలను అందించింది.
- భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) ల్యాండర్ మాడ్యూల్, ప్రొపల్షన్ మాడ్యూల్ కోసం లిథియం అయాన్ బ్యాటరీలు , టైటానియం అల్లాయ్ ప్రొపెల్లెంట్ ట్యాంక్‌ను తయారు చేసింది.
- ఎంటీఏఆర్ టెక్నాలజీస్.... లాంచ్ వెహికల్ మార్క్-3 (ఎల్‌వీఎం 3) కోసం వికాస్ ఇంజిన్‌లు, టర్బో పంప్, బూస్టర్ పంప్, గ్యాస్ జనరేటర్, ఇంజెక్టర్ హెడ్, ఎలక్ట్రో-న్యూమాటిక్ మాడ్యూల్‌లతో సహా క్రయోజెనిక్ ఇంజిన్ సబ్‌సిస్టమ్‌లను సరఫరా చేసింది.
- మిశ్రా ధాతు నిగమ్ (మిధాని)... కోబాల్ట్ బేస్ మిశ్రమాలు, నికెల్ బేస్ మిశ్రమాలు, టైటానియం మిశ్రమాలు, చంద్రయాన్ మిషన్‌లో ఉపయోగించిన లాంచ్ వెహికల్‌కు సంబంధించిన వివిధ భాగాల కోసం ప్రత్యేక స్టీల్స్ వంటి క్లిష్టమైన పదార్థాలను సరఫరా చేసింది.
- చంద్రయాన్-3 మిషన్ కోసం కెల్ట్రాన్ సంస్థ 41 ఎలక్ట్రానిక్స్ మాడ్యూల్స్, వివిధ పవర్ మాడ్యూల్స్‌ను సరఫరా చేసింది.
- కేరళ మినరల్స్ అండ్ మెటల్స్ (కేఎంఎంఎల్)... చంద్రయాన్ మిషన్‌లోని కీలక భాగాల కోసం టైటానియం స్పాంజ్ మిశ్రమాలను సరఫరా చేసింది.
- కోర్టాస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్... ఎస్200 బూస్టర్ స్టేజ్ కోసం అనేక సబ్‌అసెంబ్లీలను అందించింది.
- వజ్ర రబ్బర్ ప్రొడక్ట్స్ సంస్థ ఎల్‌వీఎం3 రాకెట్ కోసం ఎస్ 200 థ్రస్ట్ వెక్టర్ కంట్రోల్ ఫ్లెక్స్ సీల్‌ను సరఫరా చేసింది.

చంద్రయాన్-3 విజయంలో కేరళ పాత్ర

మంత్రి రాజీవ్ హర్షం

తిరువనంతపురం: చంద్రయాన్-3 విజయయాత్రలో కేరళ భాగస్వామిగా ఉండటంపై ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ హర్షం ప్రకటించారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగి చరిత్ర సృష్టించిన చంద్రయాన్-3లో కేరళకు చెందిన 26 కంపెనీలు పాలుపంచుకున్నాయని, ఇది తమకు గర్వంగా ఉందని మంత్రి వెల్లడించారు. చంద్రయాన్-3 మిషన్‌లో కేరళకు చెందిన ఆరు ప్రభుత్వ రంగ కంపెనీలు, 20 ప్రైవేట్ కంపెనీలు తమ వంతు పాత్ర పోషించాయని మంత్రి వివరించారు. మిషన్‌లో భాగస్వామి కావడం కేరళకు గర్వకారణమని పేర్కొంటూ ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. 'చంద్రుని దక్షిణ ధ్రువంపై లూనార్ ల్యాండింగ్ అద్భుత విజయం. ఇస్రోకు మంచి అభినందనలు అందాయి. అద్భుతమైన శాస్త్రవేత్తలు మిషన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. చంద్రయాన్-3 విజయంతో భారతదేశ కీర్తి అత్యున్నతస్థాయికి చేరింది. ఈ గొప్ప విజయంలో కేరళ భాగస్వామి కావడం సంతోషంగా ఉంది' అని ఎక్స్ వేదికగా రాజీవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కెల్ట్రాన్, కేఎంఎంఎల్, ఎస్ఐఎఫ్ఎల్, టీసీసీ, కేఏఎల్, సిడ్కోతో పాటు 20 ప్రైవేట్ కంపెనీలు తమ సేవలందించాయి. వివిధ ఉత్పత్తులు తయారు చేసే ఈ కంపెనీలు చంద్రయాన్-3 మిషన్‌లో పాలుపంచుకున్నాయని మంత్రి తెలిపారు.

ఆగని ఉల్లి రైతు ఆందోళన

పంట వేలం పునరుద్ధరణకు యత్నం

లభించని గిట్టుబాటు ధర

ముంబై: మహారాష్ట్రలోని నాసిక్‌లో గల కొన్ని ఏపీఎంసీలలో గురువారం ఉల్లి వేలం ప్రక్రియను పునరుద్ధరించారు. ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో రైతులు ఆందోళనకు దిగిన విషయం విదితమే. ఉల్లిపాయల వేలం ప్రక్రియను సోమవారం నుంచి రైతులు నిలిపివేశారు. ఉల్లిపై 40 శాతం ఎగుమతి సుంకం విధించాలన్న నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ 500మందికి పైగా రైతులు ముంబై-ఆగ్రా జాతీయ రహదారిని దిగ్బంధించినప్పటికీ నాసిక్‌లోని కొన్ని ఏపీఎంసీలలో ఉల్లి వేలం ప్రక్రియను కొంతసేపు కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద హోల్‌సేల్ ఉల్లి మార్కెట్ అయిన లసల్‌గావ్, పింపిల్‌గావ్, చంద్వాడ్‌లో గల ఏపీఎంసీలోఉదయం వేలం ప్రారంభించారు. అయితే, నాఫెడ్ హామీ ఇచ్చినట్లుగా క్వింటాకు రూ.2,410 చెల్లించకపోవడంతో కొంత సేపటికే వేలంను నిలిపివేశారు. వేలం సమయంలో నాఫెడ్ లేదా నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు సంబంధించిన సిబ్బంది లేకపోవడంతో రైతులు కూడా ఉల్లి వేలంను నిలిపివేసినట్లు అధికారులు వివరించారు. వేలం కోసం 300 ఉల్లిపాయల లారీలు గురువారం ఉదయం లసల్‌గావ్‌కు వచ్చాయి. ఇక్కడ క్వింటా కనీస ధర రూ.600, అత్యధిక ధర రూ.2,500, సగటు ధర రూ.2,252 పలికింది. చంద్వాడ్‌లో క్వింటా ఉల్లిపాయలు రూ.1700-1800 మధ్య నడిచిందని అధికారి ఒకరు వివరించారు. ఉదయం 8-30 గంటలకు ప్రారంభమైన ఉల్లి వేలం రైతుల ఆగ్రహంతో కేవలం 15-20 నిమిషాల పాటు మాత్రమే కొనసాగింది.

మరోవైపు, ఎగుమతి సుంకం తగ్గించాలని డిమాండ్ చేస్తూ 500 మంది రైతులు చంద్వాడ్‌లో ఆందోళనకు దిగారు. దాదాపు గంటన్నర సేపు రోడ్డును దిగ్బంధించారు. పోలీసులు రంగంలోకి దిగి...రైతులను బుజ్జగించారు. ఎగుమతి సుంకం పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి రైతులు ఆందోళన చేస్తున్నారు. దీని ప్రభావం ఉల్లిం వేలంపై తీవ్రంగా పడింది.

అసమర్థ ప్రభుత్వం: సూలే

పూణె: ఉల్లిపై ఎగుమతి సుంకానికి వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేస్తున్నా మహారాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎన్‌సీపీ నేత సుప్రియా సూలె విమర్శించారు. విధాన నిర్ణయాలు తీసుకోవడంలో నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో రాష్ట్ర ప్రభుత్వం సతమతమవుతోందని మండిపడ్డారు. కేంద్రం నిర్ణయంపై సోమవారం నుంచి నాసిక్‌లో రైతులు, వ్యాపారులు ఆందోళనలు చేస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సోమవారం నుంచి నాసిక్‌లో ఉల్లి వేలం నిలిచిపోయిందని, రైతులు ఇంకా రోడ్లపైనే ఉన్నారని ఆమె గుర్తుచేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయాన్ని కేంద్ర వినియోగ వ్యవహారాలమంత్రి పీయూశ్ గోయల్ దృష్టికి తీసుకెళ్లానని, దేశంలో ఎక్కువ పంట ఉత్పత్తి అయిందని మంత్రికి తెలిపానని, ప్రపంచంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కొరత ఉందని వివరించినట్లు ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు కూడా అయిన సూలే చెప్పారు. ఉల్లి ఎగుమతులపై ఓ స్పష్టమైన విధానంతో ముందుకు రావాలని సూచించానని, దురదృష్టమేమంటే అందుకూ ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. ఉల్లి వ్యవహారంపై కేంద్రమంత్రి గోయల్‌తో చర్చించడానికి రాష్ట్ర వ్యవసాయమంత్రి దిల్లీ వెళ్లారని, అందువల్ల ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం గందరగోళంలో ఉందని ఆరోపించారు.

ప్రజాస్వామ్యం పతనానికి ఆర్‌టీఐ చట్టం ఖూనీ: ఖడ్గే

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యాన్ని పతనం చేసే కుట్రలో భాగంగానే సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)ను మోదీ సర్కారు చంపేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖడ్గే విమర్శించారు. ఆర్‌టీఐ వెబ్‌సైట్ నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు అదృశ్యం కావడంపై ఖడ్గే గురువారం స్పందించారు. దరఖాస్తులను అంతర్గతంగా అదృశ్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆర్‌టీఐ చట్టాన్ని మోదీ సర్కారు ఖూనీ చేస్తోంది. ఇది ప్రజల రాజ్యాంగ హక్కులపై దాడి చేయడం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి అనుసరించే మరో మార్గం' అని ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. డేటా రక్షణ చట్టం పేరుతో ఆర్‌టీఐ చట్టానికి సవరణలు ప్రతిపాదించడం నియంతృత్వ ప్రభుత్వం సమాచార హక్కుపై చేస్తున్న దాడి అని ఖడ్గే విమర్శించారు. ఆర్‌టీఐ చట్టంలోని కొన్ని నిబంధనలను తొలగించడం, సరళీకరిస్తూ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లును మోదీ సర్కారు తీసుకురావడాన్ని ప్రతిపక్ష పార్టీలు, పౌర సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయని ఆయన గుర్తుచేశారు. పారదర్శకతను మోదీ సర్కారు పక్కన పెట్టడాన్ని సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు.

జావేద్ అక్తర్ విచారణపై స్టే

ముంబై: బాలీవుడ్ నటి కంగనా రనౌత్ చేసిన ఫిర్యాదు క్రమంలో ప్రముఖ లిరిసిస్ట్ జావేద్ అక్తర్ విచారణకు స్టే విధిస్తూ సెషన్స్ కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులను అదనపు సెషన్స్ జడ్జి (దిన్‌దోషి కోర్టు) ఏజే ఖాన్ వెలువరించినట్లు అక్తర్ తరపు న్యాయవాది జయ్ భరద్వాజ్ గురువారం వెల్లడించారు. కంగనా పెట్టిన కేసులో అక్తర్‌కు హడావిడిగా అనుచిత విధంగా సమన్లు జారీ అయినట్లు పేర్కొంటూ రివ్యూ పిటిషన్‌ను వేయగా, కోర్టు దానిని విచారించింది. అక్తర్‌పై దోపిడీ, నేరపూరిత బెదిరింపుల ఆరోపణలను కంగనా రనౌత్ చేశారు. అక్తర్‌పై దోపిడీ ఆరోపణలను కొట్టివేసిన అంధేరి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జులై 24న సమన్లు జారీ చేసింది. ఆయన మీద బెదిరింపుల ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. సరైన పద్ధతిలో సమన్లు జారీ చేయలేదని రివ్యూ పిటిషన్‌లో జావేద్ అక్తర్ పేర్కొన్నారు. అక్తర్ రివ్యూ పిటిషన్‌కు కంగనా రనౌత్ తన సమాధానాన్ని కోర్టుకు సమర్పించారు. కాగా, బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య నేపథ్యంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో కంగనా తనను కించపరిచేలా మాట్లాడారని ఆరోపిస్తూ 2020లో ఆమెపై కేసును అక్తర్ (76) పెట్టిన విషయం విదితమే.

కులులో భారీగా విరిగిపడ్డ కొండచరియలు

పేకమేడల్లా కూలిన భవనాలు

హిమాచల్‌ను వీడని వర్ష బీభత్సం

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు జిల్లాలో గురువారం భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ కొండల సమీపంలో కట్టుకున్న సుమారు ఎనిమిది ఖాళీ భవనాలు పేక మేడల్లా కూలిపోయాయి. అయితే ఆ భవనాల కింద కొంతమంది చిక్కుకున్నారని తెలుస్తోంది. ఈ కొండచరియలు విరిగిపడటం, భవనాలు కూలిపోవడం, వెంటనే పెద్ద మొత్తంలో దుమ్మూ, దూళి లేవడానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా.. కొండచరియలు విరిగిపడిన ఘటనలో శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్)తో సహా అత్యవసర ప్రతిస్పందన బృందాలను రంగంలోకి దిగాయి. ఈ దళాలు ఇప్పటికే సహాయక చర్యలు చేపట్టాయి. ఇదిలా ఉండగా.. మరో రెండు రోజుల పాటు హిమాచల్ ప్రదేశ్ అంతటా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గురువారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. కాగా.. కులు-మండి రహదారి దెబ్బతినడంతో కులు జిల్లాలో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. కులు జిల్లా నుంచి మండి వరకు ఉన్న రెండు రహదారులు ప్రభావితమయ్యాయని పోలీసులు తెలిపారు. పండోహ్ మీదుగా ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ మార్గం కూడా ప్రభావితమైంది. ప్రయాణాన్ని పునరుద్ధరించడానికి పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ (పీడబ్ల్యూడీ) ప్రయత్నాలు చేస్తోంది. కులు జిల్లా నుంచి మండీని కలిపే రెండు మార్గాల్లో ప్రస్తుత వర్షాలకు నష్టం వాటిల్లిందని కులు ఎస్పీ సాక్షి వర్మ 'టైమ్స్ నౌ'కు వివరించారు. పండోహ్ గుండా వెళ్లే ప్రత్యామ్నాయ మార్గం కూడా ప్రభావితమైంది. అయితే దీనిని క్లియర్ చేసేందుకు పీడబ్లూడీ చురుకుగా పని చేస్తోంది. మరోవైపు ఆహారం, తాగునీరు అందక గంటల తరబడి రోడ్డుపైనే నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాగా ఇక్కడి శివాలయం వద్ద కొండచరియలు విరిగిపడిన ప్రదేశం నుంచి మరో మృతదేహాన్ని వెలికితీశారు. సమ్మర్‌హిల్‌కు చెందిన నీరజ్‌గా గుర్తించారు. ఇప్పటివరకు సమ్మర్ హిల్‌లోని శివాలయం , ఫాగ్లీ, కృష్ణానగర్, సిమ్లాలోని మూడు పెద్ద కొండచరియలు విరిగిపడిన ఘటనల శిథిలాల నుంచి ఇప్పటివరకు 25 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు సిమ్లా ఎస్పీ సంజీవ్ కుమార్ గాంధీ పీటీఐకి తెలిపారు. గురువారం ఒక మృతదేహాన్ని బయటకు తీయగా, మరో రెండు మృతదేహాలు ఇప్పటికీ శిథిలాల కిందనే ఉన్నాయి. జూన్ 24 న హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి రాష్ట్రంలో వర్షాలకు సంబంధించిన సంఘటనలలో మొత్తం 239 మంది మరణించగా... 40 మంది గల్లంతయ్యారు.

నాలుగు-ఐదు రోజుల క్రితం ఇళ్లతో పాటు ఏడెనిమిది భవనాలు, హౌసింగ్ దుకాణాలు, బ్యాంకులు , ఇతర వాణిజ్య సంస్థలు పగుళ్లు ఏర్పడటంతో ఆ భవనాలు అసురక్షితమని ప్రకటించి ఇటీవలే ఖాళీ చేశామని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నరేష్ వర్మ తెలిపారు. జాతీయ రహదారి-305 వెంట ఉన్న కొన్ని ఇతర అసురక్షిత భవనాలను కూడా ముందుజాగ్రత్త చర్యగా ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.12,000 కోట్ల నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు గురువారం ప్రకటించారు. మరోవైపు హిమాచల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బుధవారం సాయంత్రం నుంచి పాలంపూర్‌లో 137, నహాన్‌లో 93, సిమ్లాలో 79, ధర్మశాలలో 70, మండిలో 57 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పెత్తందారీ ప్రభుత్వాలను గద్దె దించాల్సిందే

- ఏపీలో దొంగ బిల్లులతో ఇసుక దోపిడీ
- విజయవాడ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: సామాన్యుల బాగోగులు పట్టకుండా పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. 'దేశాన్ని కాపాడుకుందాం-రాష్ట్రాన్ని రక్షించుకుందాం' నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టేందుకు సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర గురువారం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించింది. విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో తొమ్మిదేళ్ల మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని విమర్శించారు. నిత్యావసర ధరలను నియంత్రించలేదని, నల్లధనాన్ని వెనక్కి తీసుకురాలేదన్నారు. రైతుల ఆదాయాన్ని రెంటింపు చేస్తామని చెప్పి...కనీసం వారి సమస్యలను పరిష్కరించలేదని మండి పడ్డారు. భారతదేశంలో అన్ని కులాలు, మతాలు, జాతులు కలిసి జీవించాలనేదే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకత మనపై ఉందన్నారు.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై

మచిలీపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశం

చల్లపల్లిలో బహిరంగ సభ

రాష్ట్రంలో భూ కబ్జాలు పెరిగాయి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారాయని రామకృష్ణ విమర్శించారు. అప్రజాస్వామిక విధానాలు, పోలీసుల అరాచకాలు, దోచుకుందాం దాచుకుందాం అనే ధోరణిలో గజదొంగల పాలన సాగుతోందని మండిపడ్డారు. పేదలకు కోసం భూపోరాటాలు చేసి 4 వేల మంది కమ్యూనిస్టు వీరులు అమరులయ్యారని గుర్తుచేశారు. ఆ భూపోరాటాల ద్వారా 10 లక్షల ఎరకాల భూమిని పేదలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పుడు భూములకు ధరలు పెరగటంతో అసైన్డు భూములను పెత్తందారులకు అప్పగించేందుకు ఆర్డినెన్సు తీసుకువస్తున్నారని చెప్పారు. దొంగ బిల్లులతో ఇసుక దోపిడీ చేస్తున్నారన్నారు.

రాజధాని పేరుతో భూ కబ్జాలు చేస్తున్నారని విశాఖ వాసులు వాపోతున్నారన్నారు. నాలుగు నెలల్లో రూ.3,500 కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాలాతీయించారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ సీఎంగా ఉంటే 2050 వరకు పోలవరం పూర్తి కాదన్నారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఆదాయంలో తక్కువగా ఆ ఉన్న తెలంగాణ ఇప్పుడు ఏపీ కంటే లక్షా యాభైవేల కోట్లు ఆదాయం గడించిందన్నారు. అమర్ రాజా కంపెనీ ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేయటం వల్ల ఆ కంపెనీ విస్తరణ కోసం తెలంగాణను ఎంచుకుందన్నారు. ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేని విమర్శించారు. పంచాయతీ సర్పంచ్ నుంచి పార్లమెంట్ సభ్యుల వరకు వైసీపీకే ప్రజలు అవకాశం ఇస్తే కేంద్ర నుంచి నిధులు రాబట్టలేకపోయారని విమర్శించారు.

బస్సుయాత్రకు ప్రజాదరణ

సీపీఐ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నదని రామకృష్ణ చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. ఆగస్టు 17న విశాఖ ఉక్కు ఉద్యమం ప్రాంతం నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర ఉత్తరాంధ్ర జిల్లాలు, గోదావరి జిల్లాల్లో పర్యటించి ఎన్టీఆర్ జిల్లాలో ప్రవేశించిందన్నారు. బస్సుయాత్రకు అన్ని ప్రాంతాల్లో బ్రహ్మారథం పట్టారని చెప్పారు. సెప్టెంబరు 8వ తేదీన తిరుపతిలో భారీ బహిరంగ సభతో యాత్ర ముగుస్తుందని, ఆ సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు ఇతర జాతీయ నాయకులు పాల్గొంటారని వివరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా...

సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర గోదావరి జిల్లాల్లో పర్యటన ముగించుకుని గురువారం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలో ప్రవేశించింది. పార్టీ శ్రేణులు పూలమాలలు, బైక్ ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికారు. రెడ్డిగూడెం సెంటర్‌లో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. అనంతరం రోడ్ షో ద్వారా మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల మీదుగా విజయవాడ నగరానికి చేరుకుంది. గొల్లపూడి వెంకటేశ్వర ఫౌండ్రీ వద్ద జి.కోటేశ్వరరావు సారధ్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద జి.ఓబులేసు ప్రచార జాతాకు స్వాగతం పలికారు. విజయవాడ భవానీపురం, సితార సెంటర్, పాలఫ్యాక్టరీ, ఎర్రకట్ట, కేదారేశ్వరపేట మీదుగా ధర్నాచౌక్‌కు చేరుకుంది. బస్సుయాత్ర విజయవాడ నగరానికి చేరుకునే సమయానికి వర్షం కురిసింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మరింత ఉత్సాహంతో పార్టీ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు బైక్ ర్యాలీతో సందడి సృష్టించారు.

పెత్తందార్లపై పోరాటం ఓ బూటకం

- కులాలు, మతాల పేరుతో పాలకుల చిచ్చు
- రెడ్డిగూడెం సభలో రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న పెత్తందారులపై పోరాటం ఓ బూటకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పేదలను కొట్టి...పెద్దలకు పెట్టడమే జగన్ లక్ష్యమని వ్యాఖ్యానించారు. సీపీఐ తలపెట్టిన బస్సుయాత్ర గురువారం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలో ప్రవేశించింది. రెడ్డిగూడెంలో జరిగిన బహిరంగసభలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పెత్తందార్లపై పోరాడి పేదలకు మేలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పేదల కోసం పెత్తందార్లపై పోరాటమని మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ మతాలు, కులాల పేరిట ప్రజల మధ్య పాలకులు చిచ్చుపెడుతున్నారని, కుర్చీలు కాపాడుకోవడానికి అనేక కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మణిపూర్ హింస గురించి సోదాహరణగా వివరించారు. సీపీఐ పోరాటాల ద్వారా పేదలకు 33 లక్షల ఎకరాల భూములను పంచిపెట్టిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ చట్టానికి తూట్లు పొడిచి... 20 లక్షల ఎకరాలను పెద్దలకు కట్టబెట్టిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా రానున్న రోజుల్లో పేదల చేతుల్లో భూమి ఉండే పరిస్థితి కనిపించడం లేదన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అక్కినేని వనజ, మహిళాసమాఖ్య నాయకులు పెన్మత్స దుర్గాభవానీ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, మండల కార్యదర్శి అడపా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగీతాలు ఆలపించారు. అనంతరం బస్సుయాత్ర రెడ్డిగూడెం నుంచి రంగాపురం, రాఘవాపురం మీదుగా శాయంపాలెం వరకు సాగింది. అక్కడ అరుణ పతాకావిష్కరణ అనంతరం మైలవరం మండలం వైపు కొనసాగింది. రెడ్డిగూడెం మండలంలో 1996 నుంచి పోరాడి సాధించుకున్న భూములపై పేదలకు హక్కులు కల్పించేలా పోరాడాలని కోరుతూ పోరాటనగర్, కనిమెర్ల, పర్వతాపురం తదితర గ్రామాల రైతులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఆలోచింపజేసిన నేతల ప్రసంగం

రెడ్డిగూడెం సభలో సీపీఐ నాయకుల ప్రసంగం ప్రజల్లో ఆలోచనను రేకెత్తించింది. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు గ్యాస్ రూ.450, పెట్రోలు రూ.60లకు లభించేదని, ఆ తర్వాత అమాంతం మూడు రెట్లు ధరలు పెంచి దేశం వెలిగిపోతోందని ప్రచారం చేస్తున్న విషయమై ఆలోచించాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం దోపిడీ చేస్తోందంటూ సభా ప్రాంగణంలోని ప్రజలంతా నినాదాలు చేశారు. గ్యాస్ రూ.500లకు, పెట్రోలు రూ.60లకు లభించేలా సీపీఐ పోరాటం చేస్తోందని ముప్పాళ్ల చెప్పగా ప్రజలు హర్షధ్వానాలు చేశారు. నిత్యావసరాలు, మందుల ధరలు పెరిగినందున వృద్ధులకు రూ.6 వేల పింఛను అందించేలా పోరాడాలని పిలుపునిచ్చారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో సీపీఐ అనేక పోరాటాలు చేసి పేదలకు లబ్ధి చేకూర్చిందన్నారు. గత ప్రభుత్వాలు పేదలకు హక్కులు కల్పించే దిశగా శాసనసభా కమిటీ, కోనేరు రంగారావు కమిటీలు ఏర్పాటు చేయగా, ఆయా కమిటీలు చేసిన సిఫారసులు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ సర్కారు వనరుల దోపిడీని విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో ఆరంభించగా, రాష్ట్ర ప్రభుత్వం సైతం వనరుల దోపిడీకి విశాఖలో తెరలేపిందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న వనరుల దోపిడీని నిరసిస్తూ సీపీఐ బస్సుయాత్ర ఆరంభించినట్లు ప్రజలకు వివరించారు.

భూముల కోసం పోరాటం

- పేదల భూముల జోలికొస్తే ఖబడ్దార్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-నూజివీడు: రానున్న పదేళ్లలో పేదవాడి చేతిలో భూములు వుండవని, పేదలు బానిసలుగా మారే ప్రమాదం పొంచి వుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ చెప్పారు. దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఐ బస్సుయాత్ర గురువారం ఏలూరు జిల్లా నూజివీడు చేరుకుంది. తొలుత పోతురెడ్డిపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం అమర్ భవనంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అధ్యక్షతన భూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పేదల పట్ల కొనసాగుతున్న వివక్షపై ప్రభుత్వాలను ప్రశ్నించారు. దేశంలో పేదరికం పెరుగుతుంటే అదానీ, అంబానీలు ధనవంతులుగా మారుతున్నారన్నారు. పేదల చేతుల్లోని భూములను భూస్వాములకు దారదత్తం చేయడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని అందుకోసమే అసైన్డ్ చట్టాలలో మార్పులు తీసుకువస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ధనవంతుల చేతులలో వున్న 13 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను వారికే చెందేలా చేసే ప్రయత్నంలో భాగమే అసైన్డ్ చట్టాల మార్పు అని చెప్పారు. రానున్న రోజులలో దున్నేవానికే భూమి నినాదంతో భూపోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భూములపై హక్కులతో పాటు సాగునీటి కోసం ఉద్యమించాలని, పోరాడందే అనుకున్నవి సాధించలేమన్నారు. నూజివీడు ప్రాంతం సస్యశ్యామలం కోసం చింతలపూడి ఎత్తిపోతల పథకం సాధనకు ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. కేంద్రంలో మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశానికి చేసిందేమి లేదన్నారు. దేశం దివాళా తీసిందన్నారు. దేశంలో వామపక్షాల బలం పెరగకుండా ప్రజాసమస్యలు పరిష్కారం కావన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూపంపిణీ చేయకుండా రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం కాదన్నారు. పేదలు సాగులో వున్న భూములకు పట్టాలు అడుగుతుంటే పట్టాలు ఇవ్వకపోగా భూములను ధనవంతులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పేదల భూములు పెద్దలకు కట్టబెడితే వామపక్షాలు చూస్తూ వూరుకోవని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవాడి చేతిలో భూమి లేకుండా చేసేందుకు కుట్రలు సాగుతున్నాయనీ, ఆందోళనలు ఉద్యమాల ద్వారా సాధించుకున్న వాటిని రక్షించుకునేం దుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదల పక్షాన నిలబడటానికి ఎర్రజెండా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. పేదల సాగుకు అనుకూలమైన భూములను పంపిణీ చేయడంతో పాటు సాగుభూములకు హక్కులు కల్పించాలనీ, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ తరాలుగా అటవీ బంజరులను సాగు చేసుకుంటున్న పేదలు సాగు హక్కులు సాధించుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న సాగు భూములకు రక్షణ లేకుండా పోతున్నదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాల విధానాల వల్లే భూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పేదవాడికి సాగుహక్కు కల్పించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు మాట్లాడారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ 2 పూర్తి చేయాలని కోరుతూ తీర్మానాన్ని సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. నూజివీడు ఏరియా కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్రకు జీవిత చందా

బస్సుయాత్ర నూజివీడు వచ్చిన సందర్భంగా పోతురెడ్డిపల్లిలో విశాలాంధ్ర జీవితచందా చేర్పించారు.కెయంకె ఈవెంట్స్ ఎండి కోనేరు వెంకట మురళీకృష్ణ ఈ జీవిత చందాను తీసుకున్నారు.ఈ చందా మొత్తాన్ని రామకృష్ణకు కొమ్మన నాగేశ్వరరావు, అక్కినేని వరప్రకాశరావు ద్వారా అందజేశారు.

ఎన్టీఆర్ బొమ్మతో రూ.వంద నాణెం

- 28న ఆవిష్కరించనున్న రాష్ట్రపతి ముర్ము
- హాజరుకానున్న చంద్రబాబు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బొమ్మతో కూడిన వంద రూపాయల నాణం ఈ నెల 28న విడుదల కానుంది. ఆరోజున రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుంది. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ ఫొటోతో నాణేన్ని ముద్రించింది. 44 మిల్లీ మీటర్ల చుట్టుకొలతతో ఉండే ఈ వంద రూపాయిల నాణేన్ని 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారు చేశారు. అలాగే ఈ నాణేనికి ఓ వైపు మూడు సింహాలతో పాటు అశోక చక్రం ఉండగా మరోవైపు ఎన్టీఆర్ చిత్రం, ఆ చిత్రం కింద నందమూరి తారక రామారావు శతజయంతి అని హిందీ భాషలో ముద్రించారు. ఆయన శతజయంతి ఈ ఏడాదితో

ముగిసినందున నాణెంపై 1923-2023 అని ముద్రించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతోపాటు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులందరూ హాజరూ కానున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఇప్పటికే ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానాలు పంపింది. అలాగే ఎన్టీఆర్‌తో పరిచయం ఉన్న కొందరు ప్రముఖులను సైతం ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

మహారాష్ట్రలో భారీగా నిషేధిత గుట్కా పట్టివేత

పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఎనిమిది వాహనాల్లో భారీగా నిషేధిత గుట్కాను తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి ముగ్గురుని అరెస్ట్ చేశారు. ముంబై-అహ్మదాబాద్ హైవేపై జుచంద్ర వద్ద ససూన్ నవ్ఘర్ సమీపంలో మంగళవారం సాయంత్రం పోలీసులు ఏడు టెంపోలు, ఒక ట్రక్కులో రవాణా చేస్తున్న నిషేధిత గుట్కా ఉన్న బస్తాలను కనుగొన్నట్టు నైగావ్ పోలీసు స్టేషన్ సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ భామే తెలిపారు. నిషేధిత గుట్కాను మీరా భయందర్ నుంచి పొరుగున ఉన్న ముంబైలోని వివిధ ప్రదేశాలలో పంపిణీ చేయడానికి ట్రక్కు నుంచి టెంపోలకు మార్చారని ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న గుట్కా విలువ రూ.56,90,496 ఉంటుందని, దీనితో పాటు ఎనిమిది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. పోలీసులను చూసిన వెంటనే వాహనాలను నడుపుతున్న వారు, వారి సహచరులు సమీపంలోని అడవిలోకి పారిపోయారని, ముగ్గురిని మాత్రమే పట్టుకోగలిగారు. వీరితో పాటు పారిపోయిన ఏడుగురిపై ఐపీసీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్- 2006లోని సంబంధిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు అధికారి తెలిపారు. నిషేధిత గుట్కాను నిందితులు ఎక్కడి నుంచి తెచ్చారు... ఎవరికి డెలివరీ చేస్తున్నారే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మహారాష్ట్రలో 2012 నుంచి గుట్కా, సువాసన, రుచి కలిగిన పొగాకు అమ్మకాలు, వినియోగం నిషేధించారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం గుట్కా విక్రయాలను నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణించి, శిక్షను ఆరు నెలల నుంచి మూడేళ్లకు పెంచింది.

సెప్టెంబరు 8 నుంచి 10 వరకు
దిల్లీలో కేంద్రప్రభుత్వ కార్యాలయాల మూసివేత

న్యూదిల్లీ: జీ20 సదస్సు దృష్ట్యా దేశ రాజధానిలోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు మూసివేయనున్నారు. ఈ మేరకు సిబ్బంది మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 9, 10 తేదీల్లో దిల్లీలో జీ20 సదస్సు జరగనుంది. ఈ సదస్సు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని భారీగా ఏర్పాట్లు చేస్తున్నందున దిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను సెప్టెంబర్ 8, 2023 నుండి సెప్టెంబర్ 10, 2023 వరకు మూసివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, శాఖలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సదస్సుకు అనేక దేశాధినేతలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరు కానున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.